కలెక్టర్ క్యాంప్ ఎదుట ఖాళీ బిందెలతో నిరసన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తమ కాలనీకి తాగునీరు అందించాలని కేఆర్కే కాలనీ వాసులు కలెక్టర్ క్యాంప్ ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. ఖాళీ బిందెలను పట్టుకొని తమకు నీరందించాలని నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడి చేరుకొని వారిని సముదాయించి కలెక్టర్‌ను కలిపిస్తామని చెప్పడంతో వారు ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా కాలనీవాసి రాజు మాట్లాడుతూ గత సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించిన సందర్భంలో అదనపు కలెక్టర్ తాగు నీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. రెండు రోజులు సక్రమంగా నీరు వచ్చిందని తెలిపారు. తరువాత రాలేదన్నారు. తమ కాలనీపై అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. తమ నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాలనీ వాసులు రాజు, సచిన్, సురేందర్, గంగుబాయి, లలితబాయి, దేవిదాస్, సంతోష్, అనిత పాల్గొన్నారు.

మెడికోల మధ్య ఘర్షణ

నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంలోని గోదావరి రోడ్‌లో గల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఆదివారం అర్ధరాత్రి జూనియర్, సీనియర్ విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణ వివాదాస్పదంగా మారింది. అర్ధరాత్రి సమయంలో వాలీబాల్ ఆడుతున్న విద్యార్థుల మధ్య మొదలైన గొడవ బయటకు పొక్కింది. దీంతో జూనియర్ విద్యార్థులకు సంబంధించిన పలువురు బయటి వ్యక్తులు కళాశాలలోకి వచ్చి సీనియర్ విద్యార్థులపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో సీనియర్ విద్యార్థికి స్వల్ప గాయాలయ్యాయి. దీన్ని నిరసిస్తూ సోమవారం సీనియర్ విద్యార్థులు తరగతులకు గైర్హాజరయ్యారు. కళాశాల అధికారులు విద్యార్థులను, పేరెంట్స్‌ను పిలిచి మందలించినట్లు సమాచారం. ఈ విషయమై మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సులేమాన్‌ను సంప్రదించగా గొడవ జరిగిన నేపథ్యంలో జూనియర్, సీనియర్ విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చామని తెలిపారు. అయితే అర్ధరాత్రి వేళ విద్యార్థులు బాస్కెట్ బాల్ ఆడాల్సిన అవసరం ఏమొచ్చిందో, గొడవ ఎందుకు జరిగిందో, బయటి వ్యక్తులు కళాశాల లోపలికి ఎలా వచ్చారన్నది ప్రశ్నార్థకంగా మారింది. దాడికి సంబంధించి పట్టణ సీఐ ప్రమోద్‌రావును వివరణ కోరగా ఎటువంటి సమాచారం లేదని తెలిపారు.

వెనుకబడిన కులాల అభివృద్ధికి దోహదం చేయాలి

- దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలి
- ఈడబ్ల్యూఎస్, జీఓ 29తో తీవ్ర నష్టం వాటిల్లుతోంది
- బీసీ కమిషన్ ఎదుట వివిధ కుల సంఘాల విజ్ఞప్తులు


బీసీ సంఘం నాయకుని అభిప్రాయం వింటున్న చైర్మెన్, సభ్యులు, వేదికపై ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల కలెక్టర్లు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్‌టౌన్

విద్యా ఉద్యోగ, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్న కులాల అభివృద్ధికి దోహదం చేయాలని ఎస్సీ,ఎస్టీ, బీసీ కుల సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని.. ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ప్రతిబంధకంగా ఉన్న ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు తొలగించాలని, జీఓ 29ను రద్దు చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్లపై దామాషా ఖరారు చేసే అంశంపై సోమవారం రాష్ట్ర బీసీ కమిషన్ తొలిసారి జిల్లాకు వచ్చింది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ బహిరంగ విచారణలో వివిధ కుల సంఘాల నుంచి విజ్ఞప్తు స్వీకరించారు. రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మెన్ గోపిశెట్టి నిరంజన్ అధ్యక్షతన నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో బీసీ కమిషన్ సభ్యులు తిరుమలగిరి సురేందర్, రాపోలు జయప్రకాష్, బాలలక్ష్మీ పాల్గొన్నారు. వీరితో పాటు ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాల కలెక్టర్లు రాజర్షిషా, అభిలాష అభినవ్, కుమార్ దీపక్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్లు శ్యామలదేవీ, దాసరి వేణు పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన కుల సంఘాల ప్రతినిధులు ఈ విచారణకు హాజరయ్యారు. అధికారులు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేసి అర్జీలు నమోదు చేసిన తర్వాత వరుస క్రమంలో కుల సంఘాల ప్రతినిధులను కమిషన్ ఎదుటకు పంపించారు. ఉదయం 10గంటలకు ప్రారంభమైన ఈ విచారణ సాయంత్రం 5గంటల వరకు సుదీర్ఘంగా సాగింది.

రాష్ట్ర వ్యాప్త పర్యటనలో భాగంగా తొలిసారి ఆదిలాబాద్‌కు వచ్చిన బీసీ కమిషన్ ఎదుట ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ కుల సంఘాల ప్రతినిధులు ఆయా వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. విద్యా ఉద్యోగ, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్నామని.. వీటి అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయా సంఘాల ప్రతినిధులు వేర్వేరుగా వినతులు అందించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల కారణంగా తీవ్రంగా నష్టపోతున్నామని..ఇటీవల ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ 29తోనూ ఉద్యోగ అవకాశాలు కోల్పోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక, ఆర్థిక అసమానతలు తొలగించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆయా కుల సంఘాల విజ్ఞప్తులపై కమిషన్ చైర్మెన్ సానుకూలంగా స్పందించారు. ఈ బహిరంగ విచారణలో ఉమ్మడి జిల్లా నుంచి 90వినతులు రాగా.. ఆదిలాబాద్ జిల్లా నుంచి 63 విజ్ఞప్తులు రాగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి 6, మంచిర్యాల జిల్లా నుంచి 7, నిర్మల్ జిల్లా 14 వినతులు వచ్చాయి.


మాట్లాడుతున్న చైర్మెన్ నిరంజన్

రిజర్వేషన్ల అమలుకు సమగ్ర సర్వే

జనాభా దామాషా ప్రకారం విద్యా, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక అభివృద్ధి, సాధికారత సాధించే దిశగా రిజర్వేషన్ల అమలు కోసం సమగ్ర సర్వే చేపట్టడం జరుగుతుందని బీసీ కమిషన్ చైర్మెన్ గోపిశెట్టి నిరంజన్ స్పష్టం చేశారు. ఆయా కుల సంఘాల ప్రతినిధులు అందించిన విజ్ఞప్తులపై విచారణ జరిపి సమాలోచనలు చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో వచ్చే నెల 13వ తేదీ వరకు పర్యటిస్తామని.. ఈ లోగా అభ్యంతరాలు ఉంటే హైదరాబాదులోని కార్యాలయంలోనూ అందజేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. నవంబర్ 4వ తేదీ నుంచి గ్రామాలు, పట్టణాల్లో ప్రతి కుటుంబానికి సంబంధించి సామాజిక, ఆర్థిక సర్వే జరుగుతుందని తెలిపారు. ఇందులో అన్ని కుల సంఘాల ప్రతినిధులు బాధ్యతలు తీసుకొని వివరాలు నమోదు చేయించేలా చూడాలని సూచించారు. డిసెంబర్ 9లోగా సర్వే వివరాలను హైకోర్టుకు నివేదిస్తామని వివరించారు.


బీసీ సంఘాల నుండి అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు


బహిరంగ విచారణకు హాజరైన బీసీ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు

విభజన తర్వాత అభివృద్ధిలో జిల్లాలు వెనుకబాటు

- సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు టి.జ్యోతి


పట్టణంలో ర్యాలీ

నవతెలంగాణ-నిర్మల్

రాష్ట్రంలో జిల్లాల విభజన తర్వాత అభివృద్ధిలో అవి వెనుకబడ్డాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు టి.జ్యోతి అన్నారు. సీపీఐ(ఎం) నిర్మల్ జిల్లా 3వ మహాసభలు సోమవారం ప్రారంభమయ్యాయి. ముందుగా జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుండి టీఎన్జీవో భవనం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం బహిరంగ సభ ఏర్పాటు చేశారు. దీనికి ముందు సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు ఆకుల సుదర్శన్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్‌కుమార్ అధ్యక్షత జరిగిన సభలో జ్యోతి మాట్లాడారు. నిర్మల్ జిల్లా ఏర్పడి 10 సంవత్సరాలు అవుతున్నా అభివృద్ధి విషయంలో చాలా వెనుకబడి ఉందన్నారు. గత ప్రభుత్వంలో జిల్లా అభివృద్ధికి నోచుకోలేదని తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సరైన సౌకర్యాలు లేవన్నారు. ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. సరిపడా డాక్టర్లు లేక రోగులకు సరైన వైద్యం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రమైనప్పటికీ ఏరియా ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా ఎందుకు మార్చడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పట్టణ కేంద్రంలో పలు వార్డుల్లో డ్రైనేజీలు, మంచినీటి సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా నిర్మల్ జిల్లా సమగ్ర అభివృద్ధికి రూ.100 కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. చిన్న జిల్లాలపై నిర్లక్ష్యం వీడి అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. లేని పక్షంలో పార్టీ ఆధ్వర్యంలో పోరాటం రూపం తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పార్టీ ప్రతినిధుల సభ ప్రారంభమైంది. కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు అడివయ్య, జిల్లా కార్యదర్శి గౌతమ్‌కృష్ణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొమ్మెన సురేష్, బి.సుజాత, దాదారావు, జిల్లా కమిటీ సభ్యులు తొడసం శంభు, తిరుపతి, ఇప్ప లక్ష్మణ్, పి.గంగామణి, ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, లంక రాఘవులు, మంచిర్యాల జిల్లా కార్యదర్శి సంకె రవి, నాయకులు సచిన్, అశోక్, ఫసివుద్దీన్, నర్సయ్య, పోశెట్టి, దిగంబర్, లలిత, ప్రసాద పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టి.జ్యోతి


జెండావిష్కరణ చేస్తున్న సుదర్శన్

జాతీయ స్థాయి సైన్స్ సెమినార్‌కు కార్మెల్ విద్యార్థి

నవతెలంగాణ-మంచిర్యాల



జాతీయ స్థాయి సైన్స్ సెమినార్‌కు జిల్లా కేంద్రంలోని కార్మెల్ కాన్వెంట్ స్కూల్ విద్యార్థి అంటోనియా ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సిస్టర్ రిన్సి తెలిపారు. జిల్లా విద్యా శాఖ అధికారి ఆధ్వర్యంలో జరుగుతున్న జిల్లా సైన్స్ సెమినార్‌లో ప్రతిభ కనబర్చిన అంటోనియాను రాష్ట్ర స్థాయి సైన్స్ పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. జాతీయ స్థాయి సెమినార్‌కు ఎంపికైన విద్యార్థిని ప్రిన్సిపాల్‌తో పాటు పలువురు అభినందించారు.

చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-నస్పూర్

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగే చెకుముకి సైన్స్-2024 సంబరాలను విజయవంతం చేయాలని జిల్లా గౌరవ అధ్యక్షుడు బత్తిని దేవన్న అన్నారు. సోమవారం నస్పూర్‌లో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో నవంబర్ 7న, మండల స్థాయిలో 21న, జిల్లా స్థాయిలో 28న, రాష్ట్ర స్థాయిలో డిసెంబర్ 14,15,16 తేదీలలో పోటీలు ఉంటాయని తెలిపారు. ప్రశ్న పత్రాలు రెండు రోజుల ముందుగానే పాఠశాలకు అందిస్తామన్నారు. పాఠశాల స్థాయిలో నవంబర్ 7న ఉదయం 10గంటలకు ప్రతి పాఠశాలలో పోటీలు నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ పాఠశాల హెచ్ఎం ఉపేందర్, ఆదిత్య పాఠశాల హెచ్ఎం తిరుపతి, రేడియంట్ పాఠశాల హెచ్ఎం అమన్ ప్రసాద్, సృష్టి పాఠశాల హెచ్ఎం రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత ప్రాంగణం కోసం పాటుపడాలి



నవతెలంగాణ-కాసిపేట

బుగ్గ ఆలయ పరిసరాల్లో ప్లాస్టిక్ రహిత ప్రాంగణం కోసం పాటుపడాలని ఎఫ్ఆర్ఓ పూర్ణచందర్ అన్నారు. సోమవారం ఆలయ పరిసరాల్లో పడేసిన ప్లాస్టిక్ కవర్లు ఆలయ సిబ్బంది, భక్తులు, కమిటీ సభ్యులతో కలిసి సేకరించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ మాట్లాడుతూ మనిషి జీవితంలో ప్లాస్టిక్ భాగస్వామ్యం అయిందని, కానీ దాని వలన మనిషికి, పర్యావరణానికి చాలా ఇబ్బందికరంగా మారిందని తెలిపారు. దాని వాడకం తగ్గిస్తే పర్యావరణానికి మేలు చేసినవారమవుతమన్నారు. ఆలయ పరిసరాల్లో పడేసిన ప్లాస్టిక్ కవర్లు పశువులు తిని చాలా తీవ్రమైన జీర్ణకోశ సంబంధిత వ్యాధులకు లోనై చనిపోయిన సంఘటనలు చూస్తున్నామని పేర్కొన్నారు. బుగ్గ ఆలయం ఆవరణలో ప్రతి సోమవారం నిర్వహించే అన్న ప్రసాద కార్యక్రమంలో ప్లాస్టిక్ ప్లేట్‌లకు బదులుగా స్టీల్ ప్లేట్లు వాడాలని ఆలయ అధికారులకు సూచించగా దాతలు ఇచ్చిన స్టీల్ ప్లేట్లను వాడారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు ప్రవీణ్ నాయక్, తిరుపతి, శ్రీనివాస్, బీట్ ఆఫీసర్లు యుగేందర్, రాజు, శంకర్, శ్రీధర్, గోపీ, వెంకటేష్, భాస్కర్, ఆలయ ఈఓ బాపురెడ్డి, కమిటీ సభ్యులు శంకర్ పాల్గొన్నారు.

నూతన స్టడీ హాల్‌ను ప్రారంభించిన జీఎం

నవతెలంగాణ-నస్పూర్

పాలిటెక్నిక్ కళాశాల గర్ల్స్ హాస్టల్ ప్రాంగణంలో నూతన స్టడీ హాల్, కళాశాలలో గార్డెన్స్, సెక్యూరిటీ డిపార్ట్మెంట్లో నూతన ఆర్వో ప్లాంట్లను పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌తో కలిసి జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఉద్యోగుల మౌలిక సదుపాయాల కల్పనలో ముందుంటుందన్నారు. దీనిలో భాగంగా సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న విద్యార్థుల కొరకు నూతన స్టడీ హాల్ ఏర్పాటు చేశామని తెలిపారు. స్టడీ హాల్‌ను కళాశాల విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు. సెక్యూరిటీ విభాగంలో పనిచేస్తున్న సుమారు 400 మంది ఉద్యోగులకు ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఓ టూ జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీసైదా, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షులు కె.వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు, ఆనంద్ కుమార్, ఏరియా సర్వే అధికారులు వెంకటేశం, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ జక్కారెడ్డి, ఫారెస్ట్ ఆఫీసర్ చంద్రమణి, ఐటీ ఆఫీసర్ శ్రీనివాస్, పాలిటెక్నిక్ కళాశాల ఉపాధ్యాయులు, సెక్యూరిటీ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని కళాశాలపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ ఆసిఫాబాద్

విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తూ నిబంధనలు పాటించని జిల్లా కేంద్రంలోని చైతన్య డిగ్రీ, జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్ డిమాండ్ చేశారు. ప్రజావాణిలో భాగంగా ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా ఒకే ప్రాంగణంలో ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలలు నిర్వహిస్తున్నారని తెలిపారు. యూనివర్సిటీ నిబంధనల ప్రకారం ఒకే ప్రాంగణంలో రెండు కళాశాలలు ఉండకూడదని, రెండింటికి ఒకే అధ్యాపకుడు బోధించకూడదని నిబంధనలు ఉన్నాయని పేర్కొన్నారు. వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దుర్గం నిఖిల్, జిల్లా కమిటీ సభ్యులు వంశీ పాల్గొన్నారు.

బాణాసంచా దుకాణదారులు నిబంధనలు పాటించాలి

మందమర్రి : బాణాసంచా దుకాణదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సీఐ శశిధర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దుకాణాదారులు సంబంధిత ప్రభుత్వ శాఖల అనుమతులు తీసుకోవాలని తెలిపారు. మందమర్రి సర్కిల్ పరిధిలో దీపావళి సందర్భంగా చట్టానికి వ్యతిరేకంగా ఎవరైన అనుమతి లేకుండా బాణాసంచాను ఇళ్లల్లో, షాపుల్లో, జన సముదాయాల మధ్య గోదాముల్లో నిల్వ చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. లైసెన్స్ కలిగిన వారు దీపావళి సామాగ్రి ఉన్న ప్రదేశాలలో ఫైర్ సేఫ్టీ కచ్చితంగా పాటించాలన్నారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అక్రమాలు జరిగితే విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేయాలి

నవతెలంగాణ-మందమర్రి

సంస్థలో అక్రమాలు జరిగితే విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేయాలని ఏరియా ఇన్‌చార్జి జీఎం రాజేశ్వర్ ఒడ్డి ఉద్యోగులకు సూచించారు. సింగరేణి విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను సోమవారం మందమర్రి ఏరియా జీఎం కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా ప్రభుత్వ సంస్థలతో పాటు సింగరేణి సంస్థలో కూడా అక్టోబర్ 28నుండి నవంబర్ 3 వరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను గనులు, డిపార్ట్మెంట్ల నిర్వహిస్తున్నారని తెలిపారు. అవినీతికి వ్యతిరేకంగా ఉద్యోగులందరినీ చైతన్యపరిచి, అవినీతి నిర్మూలనలో అందరినీ భాగస్వాములను చేయడమే విజిలెన్స్ అవగాహన వారోత్సవాల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. సంస్థలో అక్రమాలు జరిగితే విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేయాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతారని తెలిపారు. దేశ ప్రగతికి అవరోధమైన అవినీతిని నిరోధించే బాధ్యత ప్రతి ఉద్యోగిపై ఉందన్నారు. ఈ కార్యక్రమాలలో భాగంగా ఉద్యోగులకు వ్యాసరచన పోటీలు, సింగరేణి స్కూల్‌లోని విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. అనంతరం విజిలెన్స్ సమగ్రత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, ఐఈడి డీజీఎం రాజన్న, డివైపీఎం ఆసిఫ్, జీఎం కార్యాలయ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


మందమర్రి



జైపూర్

జైపూర్ : అవినీతి లేనప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని సింగరేణి విద్యుత్ థర్మల్ ప్లాంట్ ఈడి రాజశేఖర్‌రావు అన్నారు. సోమవారం ప్లాంట్ పరిపాలన భవనంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో ముఖ్యఅతిథిగా మాట్లాడారు. పాశ్చాత్య దేశాలు అభివృద్ధి చెందుతున్నాయంటే అక్కడ అవినీతి లేకపోవడమే కారణమని అన్నారు. ఒకప్పుడు దేశంలో విపరీతమైన అవినీతి ఉండేదని, విజిలెన్స్ అధికారుల అవగాహన కార్యక్రమాల ద్వారా కొంతమేర తగ్గిందని తెలిపారు. అవినీతిని సమూలంగా నిర్మూలిస్తే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. విజిలెన్స్ విభాగం అధికారి రామబ్రహ్మం మాట్లాడుతూ అవినీతి నిర్మూలన కేవలం ఒక వ్యక్తి ఒక విభాగంతో సాధ్యం కాదని, ప్రతి ఉద్యోగి అధికారి సహాయ సహకారం అవసరమని పేర్కొన్నారు. అనంతరం అధికారులు, ఉద్యోగులు పౌరుల సమగ్రత ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జీఎం పిసిఎస్ శ్రీనివాసులు, ఏఐటియుసి పిట్ కార్యదర్శి సత్యనారాయణ, సిఎంఓఏఐ ప్రెసిడెంట్ సముద్రాల శ్రీనివాసు, ఏజీఎం సివిల్ ప్రసాద్, ఏజీఎం ఈఅండ్ఎం మదన్‌మోహన్ పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు

నస్పూర్: ప్రజావాణికి అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో క్షేత్రస్థాయిలో విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతీలాల్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్‌డీఓలు వి.రాములు, హరికృష్ణ, డీఆర్‌డీఓ కిషన్‌తో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంపుదల, ఓటరు జాబితా రూపకల్పనపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. నవంబర్ 1, 2024 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు నమోదు చేసుకునే విధంగా జిల్లా వ్యాప్తంగా విస్తృత స్థాయి ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ఎన్నికలలో ఓటింగ్ శాతం పెంపొందించడంతో పాటు తక్కువ పోలింగ్ నమోదైన ప్రాంతాలను గుర్తించి ప్రజలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. డిగ్రీ కళాశాలల్లో క్యాంపస్ అంబాసిడర్లను ఎంపిక చేసి విద్యార్థులకు ఓటు హక్కు విలువపై అవగాహన కల్పించడంతో పాటు ఓటు హక్కుపై పాటలు, వ్యాసరచన పోటీలు నిర్వహించడం ద్వారా ఓటు విలువ తెలియజేయాలని తెలిపారు. ప్రజల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాలలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, కరపత్రాలు పంపిణీ చేయాలని, ఆటోల వెనుక స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని, ఆడియో, వీడియో సాధనాల ద్వారా ప్రచారం నిర్వహించాలని, అన్ని కళాశాలల్లో ఓటు నమోదుపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. స్వయం సహాయ సంఘాలతో సమావేశాలు నిర్వహించి ర్యాలీలు, 2కె రన్ కార్యక్రమాలు, షాపింగ్ మాల్స్ వద్ద అవగాహన కల్పించే విధంగా ఏర్పాట్లు చేయాలని పర్కొన్నారు. ఆదివాసీ, గిరిజన ప్రాంతాలలో ప్రచారం నిర్వహించి అర్హత గల ప్రతి ఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉపాధ్యాయుల ఎంఎల్‌సి కొరకు ఫారం-19, పట్టభద్రుల ఎంఎల్‌సి కొరకు ఫారం-18 ద్వారా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తెలిపారు. దివ్యాంగులు, అంధులు, ట్రాన్స్‌జెండర్లు, వయోవృద్ధులు, 18 సంవత్సరాలు నిండి అర్హత గల వారిని ఓటరు జాబితాలో తప్పనిసరిగా నమోదు చేయాలని, ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి ప్రజలకు అవగాహన కలిగించే విధంగా విస్తృత స్థాయి ప్రచారం నిర్వహించాలని తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
మంగళవారం | అక్టోబర్ 29, 2024 | www.navatelangana.com

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-సారంగాపూర్



మండలంలోని చించోలి(బి) గ్రామానికి చెందిన రేని రాజు(32) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని, ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట మాజీ జిల్లా రైతు సమన్వయ కమిటీ చైర్మెన్ నల్ల వెంకట్ రాంరెడ్డి, ఆలూరు సొసైటి చైర్మెన్ మాణిక్‌రెడ్డి, నాయకులు చాట్ల రమేష్, పతాని భూమేశ్, ఎస్.వెంకటరమణారెడ్డి, చాట్ల చంద్రశేఖర్, పొతిండ్ల శంకర్, ముక్తార్, రాజేశ్వర్, అడెల్లు ఉన్నారు.

ప్రజావాణికి అధికారులు గైర్హాజరు



కుబీర్ : ప్రతి సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ఆయా శాఖల అధికారులు హజరు కావాల్సి ఉండగా కేవలం నాలుగు శాఖలకు చెందిన అధికారులు మాత్రమే హజరయ్యారని అన్నారు. పలువురు అర్జీదారులు పేర్కొన్నారు. ప్రజలు వివిధ సమస్యలతో ప్రతి సోమవారం ప్రజావాణికి తమ సమస్యలు తెలిపేందుకు వస్తున్నారని అన్నారు. కాని అధికారులు పూర్తి స్థాయిలో హజరుకాకపోవడంతో అర్జీదారులు సమస్యలు ఎవరి తెలియజేయాలో అర్థం కావడం లేదని అన్నారు. సమస్యలు పెండింగ్‌లో ఉంటున్నాయని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజావాణికి పూర్తిస్థాయిలో హజరుకావాలని కోరారు. లేని పక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణికి తహసీల్దార్, ఎంపీఓ, ఐకేపీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హజరైనట్లు తెలిపారు. హజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు.

రాష్ట్ర స్థాయిలో రాణించి మెడల్స్ తీసుకురావాలి

- ఉత్సాహంగా స్విమ్మింగ్ ఎంపిక పోటీలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో రాణించి జిల్లాకు మెడల్స్ తీసుకురావాలని ఎస్జీఎఫ్ కార్యదర్శి కాంతారావ్ ఆకాంక్షించారు. ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలోని కేకే స్విమ్మింగ్ అకాడామిలో అండర్ 14, 17 బాలబాలికల జిల్లాస్థాయి స్విమ్మింగ్ ఎంపిక పోటీలను నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా గిరిజన క్రీడాల అభివృద్ధి అధికారి పార్థసారథి హాజరై జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు మెడల్స్ అందించి, రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. అనంతరం రాష్ట్రస్థాయి కబడ్డీ అసోసియేషన్‌లో జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాష్ట్రపాల్‌కు చోటు దక్కడంతో ఆయనను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్జీఎఫ్ కార్యదర్శి కాంతారావ్ మాట్లాడుతూ నవంబర్ 2 నుంచి 4 వరకు హైదరాబాద్‌లోని బోరన్ పల్లిలో జరిగే రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు జిల్లాస్థాయి క్రీడాకారులను ఎంపిక చేసేందుకు పోటీలు నిర్వహించామన్నారు. ఇక్కడ క్రీడాకారులు మంచి ప్రదర్శన ఇచ్చారన్నారు. రాష్ట్ర స్థాయిలో కూడా ఇదే ప్రదర్శన చూపించి మెడల్స్ సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోచ్ కొమ్ము కృష్ణ, చంద్రకాంత్ పాల్గొన్నారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు



నవతెలంగాణ-ఉట్నూర్

రైతులు తమ పంటను ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు మాత్రమే అమ్ముకోవాలని రైతు ఉత్పత్తిదారుల సంస్థ సీఈఓ కాంబ్లే ప్రజ్ఞశీల్ అన్నారు. సోమవారం ఉట్నూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో పంటలను పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. రైతులకు ఎలాంటి సమస్యలు ఎదురైతే ఉట్నూర్ మండల సమైక్యను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు ఉన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో స్కాలర్‌షిప్‌పై అవగాహన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో సోమవారం స్కాలర్‌షిప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా.అతిక్ బేగం పాల్గొని మాట్లాడుతూ అందుబాటులో ఉన్న ఆర్థిక సాయంపై విద్యార్థులకు అవగాహన పెంపొందించే ప్రయత్నంలోనే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ స్కాలర్‌షిప్‌ల గురించి, విద్యార్థులకు తెలియజేశామని తెలిపారు. ఆర్థిక భారం లేకుండా విద్యార్థులు తమ విద్యా లక్ష్యాలను సాధించడంలో ఈ స్కాలర్‌షిప్‌ల ప్రాముఖ్యతను గురించి వివరించారు. విద్యార్థులందరూ తమ అవసరాలకు సరిపోయే స్కాలర్‌షిప్‌లను చురుకుగా వెతకాలని, పొందాలని ప్రోత్సహించారు. చాలా మంది అర్హులైన విద్యార్థులు తరచుగా ఈ అవకాశాలను కోల్పోతున్నారని తెలియజేశారు. స్కాలర్షిప్ దరఖాస్తు ప్రక్రియకు సంబంధించి ఏవైనా సందేహాలు వివరణల కోసం విద్యార్థులు కళాశాల కార్యాలయ సిబ్బందిని సంప్రదించవచ్చునని సూపరింటెండెంట్ కరుణాకర్ తెలిపారు. దరఖాస్తు ప్రక్రియను సమర్థవంతంగా నావిగేట్ చేయడంలో విద్యార్థులకు మద్దతు ఇవ్వడానికి సిబ్బంది నిబద్ధతను తెలియజేశారు. అదనంగా స్కాలర్‌షిప్ కోఆర్డినేటర్ డాక్టర్ కోటయ్య, స్కాలర్‌షిప్ ఇన్‌చార్జ్ నరేష్ కుమార్, దరఖాస్తు విధానాల గురించి అవసరమైన పత్రాలతో వివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రఘు, గణపతి, కరుణాకర్, కోటయ్య, ఎం. నరేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

నవతెలంగాణ-నిర్మల్



ప్రజా సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూసమస్యలు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు వంటి సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ప్రజలు తమ అర్జీలను సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఒకే సమస్యపై ప్రజలు మళ్లీమళ్లీ దరఖాస్తులు సమర్పించాల్సిన అవసరం లేదని తెలిపారు. ఇప్పటి వరకు శాఖల వారీగా పెండింగ్ లో ఉన్న దరఖాస్తులు, సీఎం ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించినప్పుడు వాటికి సంబంధించిన వివరాలను క్లుప్తంగా రిమార్కుల విభాగంలో పొందుపరుచాలని, దరఖాస్తుదారులకు పరిష్కారానికి సంబంధించిన వివరాలను అందజేయాలన్నారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన ప్రజల సమస్యలు పరిష్కారానికి చర్యలు



నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయ ఛాంబర్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను ఆమె స్వీకరించారు. ఉట్నూర్ మండలం దంతన్‌పల్లి గ్రామానికి చెందిన రామస్వామి పింఛన్ ఇప్పించాలన్నారు. జన్నారం మండలం మురిమడుగు గ్రామానికి చెందిన రాహుల్ గిరి వికాసం పాఠశాలలో అడ్మిషన్ కల్పించాలని కోరారు. తిర్యాణి మండలం మొర్రిగూడ గ్రామానికి చెందిన టెకం రాజు తనకు ఏడ్ల జత మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబందించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులు అందజేవారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని, సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జనరల్ వసంతరావు, ఏఓ దామోదర స్వామి, ఐసీడీఎస్ ఉమాదేవి, జేడీఎం నాగభూషణం, డీపీఓ ప్రవీణ్, మేనేజర్ లింగు పాల్గొన్నారు.

సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు అందించాలి



ఇంద్రవెల్లి



ఉట్నూర్

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం మండలంలోని మల్లాపూర్ గ్రామంలో దండారి ఉత్సవాలలో పాల్గొన్నారు. ముందుగా ఎత్మాసూర్ దేవతలకు పూజలు చేశారు. అనంతరం గుస్సాడీలతో కలిసి సాంప్రదాయ నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసుల సంస్కృతి సాంప్రదాయాలు గొప్పవన్నారు. తరతరాలుగా వస్తున్న సంస్కృతి సాంప్రదాయాలను ఆచార వ్యవహారాలను కట్టుబాట్లను మరవద్దని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో దండారి ఉత్సవాలకు రూ.15వేలను అందిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా దుర్వ సంతోష్ బెట్టి ఎలిజబేత్ స్మారక గ్రంథాలయం తరపున ఆవిష్కరించిన కడెం నది పుస్తకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముకాడే ఉత్తం, మాజీ సర్పంచ్ బాపూరావ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉట్నూర్ : మండలంలోని టక్కుగూడ గ్రామంలో సోమవారం దండారి ఉత్సవాల్లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొన్నారు. ముందుగా ఎత్మాసూర్ దేవతలకు పూజలు చేశారు. అనంతరం గుస్సాడీలతో కలిసి సంప్రదాయ నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అకాడి పండుగ నుంచి మొదలుకొని దీపావళి వరకు ఆదివాసులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే పండుగ దండారి ఉత్సవాలని అన్నారు. తరతరాలుగా ఆదివాసులు ప్రతిఏటా దండారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని పేర్కొన్నారు. తాత ముత్తాతల నుంచి వస్తున్న సంస్కృతి సాంప్రదాయాలని మరువకుండా ఉండాలన్నారు. నూతన సంస్కృతులను అవలంబించకూడదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దండారి ఉత్సవాల నిర్వహణకు రూ.15 వేలు ప్రతి దండారికి త్వరలో అందజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గంపగుత్త విధానంతో రైతులకు తీవ్ర అన్యాయం

- రాత్రికి రాత్రి రేటు కుదిరిచ్చి రైతులకు అన్యాయం



నవతెలంగాణ-బేల

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల పట్ల వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ, రైతులకు పూర్తిగా అన్యాయం చేస్తున్నాయని, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. బేల మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్వహించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వల వైఖరిని ఎండగట్టారు. జోగు రామన్న మాట్లాడుతూ రాత్రికి రాత్రి గంపగుత్త విధానంలో ప్రయివేట్ వ్యాపారులతో లోపాయకారి ఒప్పందం కుదుర్చుకొని కొనుగోళ్లు నిర్వహించడమే కాకుండా, తేమ శాతం సాకు చూపుతూ పత్తి రైతులను మోసం చేస్తున్నారన్నారు. దీపావళి పండగ పూట రైతుల జీవితాలను చీకటిమయం చేయడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగదన్నారు. రైతు సంఘం నాయకులు, రైతుల సమక్షంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించాల్సిన సమావేశాలను చీకటి ఒప్పందంలో నిర్వహించడం తగదన్నారు. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే బీజేపీ నాయకులున్నప్పటికిని సీసీఐ ద్వారా రైతులకు ధర కల్పించడంలో విఫలం చెందారన్నారు. కనీసం కమర్షియల్ పార్చేస్ అనుమతులు తీసుకోలేని పరిస్థితిలో ఎంపీ, ఎమ్మెల్యే విఫలమవుతున్నారు. ఆదిలాబాద్ పత్తి నాణ్యతలో వేరే రాష్ట్రాల కంటే ముందున్నప్పటికిని ఆదిలాబాద్ పత్తికి ధర కల్పించడంలో ఎందుకు వెనకబడుతున్నామని ప్రశ్నించారు. కనీసం రాష్ట్ర ప్రభుత్వం కూడా పత్తితో పాటు ప్రతి పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి మోసం చేయడంతో రైతుల తీవ్ర ఇబ్బందిని ఎదుర్కోవడం జరుగుతుందన్నారు. హర్యానా, పంజాబ్, గుజరాత్ కంటే నాణ్యమైన పత్తి ఆదిలాబాద్‌దని, వాటి సరసన ఆదిలాబాద్ కూడా పత్తి ధరను కల్పించాలని డిమాండ్ చేశారు. ఇకనైనా రైతు సంఘం నాయకులు రైతుల సమక్షంలో కలెక్టర్ ధరను కల్పించినట్లయితే రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మెన్ మనోహర్, సతీష్ పవార్, గంభీర్ ఠాక్రె, ప్రమోద్‌రెడ్డి, తన్వీర్‌ఖాన్, తేజరావ్, దేవన్న, మంగేష్, మనోజ్ పాల్గొన్నారు.

గిరిజనేతరులకు అన్యాయం జరగకుండా చూడాలి

నవతెలంగాణ-నార్నూర్



ఏజెన్సీ చట్టాలని అమలు చేస్తూనే, ఏజెన్సీ ప్రాంతంలో దశాబ్దాలుగా తాత ముత్తాతల నుంచి నివసిస్తున్న గిరిజనేతరులకు అన్యాయం జరగకుండా చూడాలని, నార్నూర్ మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్ బీసీ కమిషన్‌ను కోరారు. తెలంగాణ రాష్ట్రంలో రాబోయే స్థానిక సంస్థల్లో కల్పించాల్సిన రిజర్వేషన్లపై విచారణకు రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మెన్ నిరంజన్ నేతృత్వంలోని బీసీ కమిషన్ జిల్లా పర్యాటనకు వచ్చిన సందర్భంగా జిల్లా కేంద్రంలోని కాన్ఫరెన్స్ హల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మైదాన ప్రాంతంలో ప్రస్తుతం ఉన్న ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల పద్దతినే యథాతథంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో కొనసాగించాలని అన్నారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ కే.పరమేశ్వర్ ఉన్నారు.

పులులతోనే అటవీ సంరక్షణ



నవతెలంగాణ-సారంగాపూర్

పులులతోనే అటవీ సంరక్షణ అని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శరవణన్ అన్నారు. సోమవారం మండలంలో చిరుత, పెద్దపులి సంచరిస్తుందన్న సమాచారం మేరకు సోమవారం అడెల్లి అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. నాలుగు రోజులుగా అటవీ అధికారుల పనితీరును అడిగి తెలుసుకొని, మరిన్ని సూచనలు చేశారు. అటవీ ప్రాంత గ్రామాలు, తండాల్లోని ప్రజలను అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించారు. పులి సంరక్షణ అందరి బాధ్యత అని, ఎవ్వరూ పులులకు హానీ తలపెట్టకూడదన్నారు. ఇప్పటి వరకు పులుల వల్ల నష్టం వాటిల్లిన రైతులకు వెంటనే పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీసీఎఫ్ వెంట డీఎఫ్ఓ నాగిని బాను, ఎఫ్ఆర్ఓలు రామకృష్ణ, వేణుగోపాల్, డిప్యూటి ఆర్ఓలు నజీర్ ఖాన్, సంతోష్, ఎఫ్‌బీఓలు ఉన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల గేట్ మీటింగ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం ఆలిండియా పిలుపుమేరకు ఆదిలాబాద్ బ్రాంచ్ గేట్ మీటింగ్ సోమవారం నిర్వహించారు. ఈ మీటింగ్‌లో ప్రజలకు బీమా ఇవ్వలంటే, ఐఆర్‌డీఏ కనీస బీమా రూ.1లక్ష నుంచి రూ.2లక్షల వరకు పెంచిందన్నారు. ప్రీమియం పెంచడంతో ప్రజలకు జీవిత బీమాను పొందలేకపోతున్నారని అన్నారు. ఇలాంటి పలు అంశాలు యూనియన్ బీమా ఏజెంట్లకు పాలసీదారులకు అనుకూలంగా లేదని ఏజెంట్లు గేట్ మీటింగ్ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్ల యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు చందర్, ప్రధాన కార్యదర్శి ఉష్కం నర్సింగ్ పాల్గొన్నారు.

కళాశాలలో దివాళీ విత్ మై భారత్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కామర్స్ డిగ్రీ కళాశాలలో సోమవారం దివాళి విత్ మై భారత్ అనే కార్యక్రమాన్ని చేపట్టారు. అక్టోబర్ 27 నుంచి 31 వరకు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అతిక్ బేగం తెలిపారు. ఈ సందర్భంగా నెహ్రూ యువ కేంద్రంతో కలిసి పట్టణంలోని వివిధ కాలనీలో స్వచ్ఛత చెత్తను ఏరివేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్కడక్కడ ఉన్న చెత్తను తొలగించి పరిశుభ్రం చేశారు. పరిశుభ్రతతోనే సగం రోగాలను దూరం చేయవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి సుశీల్ భడ్, సిబ్బంది మజీద్, ఎన్సీసీ కేర్ టేకర్ చంద్రకాంత్, ఎన్ఎస్ఎస్ పీఓలు పృథ్వీరాజ్, యాకూబ్ అలీ, అధ్యాపకులు నరేష్ క్యాడెట్లు, వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- తహసీల్దార్‌కు తపస్ వినతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పెండింగ్ బిల్లులు చెల్లించాలని, పెండింగ్ డీఏలు చెల్లింపు చేయాలని పీఆర్సీ అమలు చేయాలని, తపస్ జిల్లా అధ్యక్షుడు సునీల్ చౌహన్ డిమాండ్ చేశారు. రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో తీసుకున్న నాలుగు దశల ఉద్యమ కార్యాచరణలో భాగంగా సోమవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఆదిలాబాద్ తహసీల్దార్ కార్యాలయం ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సునీల్ చౌహన్ మాట్లాడుతూ ఐదు డీఏలు, పెండింగ్‌లో ఉంటే రాష్ట్ర ప్రభుత్వం కేవలం 1 మాత్రమే ప్రకటించడం చాలా అన్యాయమన్నారు. వేతనాలపై ఆధారపడి జీవించే ఉద్యోగ ఉపాధ్యాయులకు న్యాయంగా రావాల్సిన డీఏల కోసం కూడా ఉద్యమాలు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఆలోచించి మిగతా పెండింగ్ డీఏలను వెంటనే ప్రకటించాలని, పీఆర్సీ నివేదిక తెప్పించుకొని, తెలంగాణ రాష్ట్రంలో రెండో పీఆర్సీని 50శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఉపాధ్యాయులు తమ అవసరాల కోసం దాచుకున్న జీపీఎఫ్, సరెండర్ లీవ్ లాంటి బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో తపస్ మండలాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సింగిడి వెంకట్ రామ్‌రెడ్డి, దత్త్రాత్రి, ముండే గోపాల్, కృష్ణ, కేశవ్, గోపాల్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
కుమురంభీం ఆసిఫాబాద్
మంగళవారం | అక్టోబర్ 29, 2024 | www.navatelangana.com

పశువులకు టీకాలు వేయించాలి

నవతెలంగాణ-కౌటాల



రైతులు పశువులకు గేదెలకు టీకాలు వేయించాలని పశు వైద్య అధికారి శ్రీకాంత్ తెలిపారు. సోమవారం మండలంలోని గుండాయిపేట్ గ్రామాలలో ఉచిత పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పశువులకు గేదెలకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. మూగ జీవాలకు ఎలాంటి వ్యాధులు సోకినా తమకు సమాచారం అందిస్తే నేను మీ ఇంటికి వచ్చి ఉచితంగా వైద్యం చేసి మూగజీవాలను రక్షణ కోసమే పనిచేస్తానని అన్నారు. ఆయన వెంట పశు వైద్య సిబ్బంది సత్యనారాయణ, సందీప్, భిక్షపతి, ప్రకాష్ ఉన్నారు.

మున్సిపల్ స్థలాల కబ్జాలు అరికట్టాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో మున్సిపల్ స్థలాల కబ్జాలు యథేచ్ఛగా కొనసాగుతోందని, దీన్ని అరికట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీ మున్సిపల్ కౌన్సిలర్ షబ్బీర్‌హుస్సేన్ సబ్ కలెక్టర్ శ్రద్దా శుక్లాకు వినతిపత్రం ఇచ్చారు. సర్వే నెంబర్ 143, 147/2లోని స్థలాలు కబ్జాకు గురైనా అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. 143లోని 999 చదరపు గజాల స్థలాన్ని గతంలో రెవెన్యూ శాఖ మున్సిపాలిటీకి కేటాయించిందనీ, దీనిలో అనాథలకు ఆశ్రయం కల్పించేందుకు భవనం నిర్మించాలని నిర్ణయిస్తే ఆ స్థలాన్ని భూబకాసురులు ఆక్రమించుకొని ఇతరులకు అమ్మి సొమ్ము చేసుకున్నారని పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టాలని కోరారు. స్పందించిన సబ్ కలెక్టర్ దీపావళి పండుగ అనంతరం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని షబ్బీర్‌హుస్సేన్ తెలిపారు.

మందుల అక్రమ విక్రయాలపై విచారణ జరిపించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని ఈఎస్ఐ ఆస్పత్రి డిస్పెన్సరీలో చోటు చేసుకున్న మందుల అక్రమ విక్రయాలపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ శ్రద్దా శుక్లాకు పార్టీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. డిస్పెన్సరీకి చెందిన మందులు ఇటీవల కరీంనగర్‌లోని ఒక మందుల దుకాణంలో విక్రయిస్తుండగా పట్టుకున్నారని, దీని వెనుక ఆస్పత్రి సిబ్బంది హస్తం కూడా ఉన్నట్లు అనుమానాలు ఉన్నందున వెంటనే పూర్తి స్థాయి విచారణ చేపట్టి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రి సిబ్బంది కూడా సమయపాలన పాటించకుండా ఇష్టం వచ్చిన సమయంలో వస్తూ పోతున్నారని వారు ఆరోపించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముంజం ఆనంద్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యులు రాజేందర్ ఉన్నారు.

పత్తికి కనీస మద్దతు ధర ప్రకటించాలి



నవతెలంగాణ-కెరమెరి

పత్తికి కనీస మద్దతు ధర రూ.10 వేలు ఇవ్వాలని మాలీ సంక్షేమ సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి లెన్గురే బాలాజీ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు ఆరుగాలం కష్ట పడి పండించిన పంటకు ప్రభుత్వం కనీస మద్దతు ధర ఇవ్వకుండా రైతులకు అన్యాయం చేస్తుందని ఆరోపించారు. పంట దిగుబడి లేక రైతులు నష్ట పోతున్న రైతులకు పెట్టిన పెట్టుబడి రావడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. సీసీఐలో ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.7,550 కాగా ప్రయివేటు వ్యాపారులు రూ.6500 ధరకే కొనుగులు చేస్తుండడంతో రైతులు నష్టపోతున్నారని అన్నారు. పట్టాలు లేని రైతుల వద్ద సీసీఐ పత్తి కొనుగోలు చేయకపోవడంతో రైతులు ప్రయివేటు వ్యాపారులను ఆశ్రయించడంతో నష్టపోతున్నారని తెలిపారు. సీసీఐలో పట్టాలు లేని రైతులు పండించిన పత్తిని కొనుగులు చేసేలా ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాలీ సంక్షేమ సంఘం మండల మాజీ అధ్యక్షుడు వాడై సుభాష్, వాడై ప్రమేశ్వర్, నాందేవ్, నికోడే శ్రావణ్, సెండే మహేష్ రాజు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల అభివృద్ధికి రూ.50వేలు అందిస్తా



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి తన వంతు సహాయంగా రూ. 50 వేలు అందిస్తానని కరీంగనర్ అల్ఫోర్స్ విద్యాసంస్థల ఛైర్మన్ వి నరేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం కాగజ్‌నగర్ పట్టణానికి వచ్చిన ఆయన స్థానిక ఫంక్షన్ హాలులో పట్టభద్రులు, మేధావులు, వివిధ కళాశాలల కరస్పాండెంట్లతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 800 మంది విద్యార్థులున్నా అందుకు సరిపడా గదులు లేవనే విషయం నా దృష్టికి వచ్చిందని, నా వంతు సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో తాను పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నానని, తనకు మద్దతివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల కరస్పాండెంట్‌లు కుడిక్యాల రాజమౌళి, అనూప్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

పిల్లల్లో వైకల్యాన్ని గుర్తించాలి

నవతెలంగాణ-కెరమరి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల్లో ఉన్నటువంటి వైకల్యాన్ని గుర్తించాలని విద్యాధికారి ఆడే ప్రకాష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రశాస్త్ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21 వైకల్యాలలో విద్యార్థులు ఏదైనా వైకల్యంతో బాధపడుతూ ఉన్నా, అలాంటి విద్యార్థులను గుర్తించడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. దీనిలో భాగంగా ప్రశస్త అనే ప్రత్యేక యాప్ ద్వారా ప్రభుత్వం తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఈ యాప్‌లోని ప్రశ్నల ద్వారా విద్యార్థుల్లోని వైకల్యాలను గుర్తించవచ్చన్నారు. గుర్తించిన వైఖల్యాలను ఐఈఆర్పీ ద్వారా ధృవీకరించి జిల్లా స్థాయి అధికారులకు నివేదిక అందించాలన్నారు. తరగతి గదిలో విద్యార్థుల పట్ల సమానత్వాన్ని చూపాలని అన్నారు. విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి కచ్చితమైన వివరాలు ప్రశాస్త్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎస్‌సీ హెచ్ఎం రవీందర్, సీహెచ్ భరత్ కుమార్, గంగారం పాల్గొన్నారు.



తునికాకు పెండింగ్ బోనస్ చెల్లించాలి

- టీఏజీఎస్ జిల్లా అధ్యక్షురాలు కొరెంగ మాలశ్రీ
- డిఎఫ్ఓ కార్యాలయం ఎదుట ధర్నా



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తునికాకు కూలీలకు పెండింగ్ బోనస్ చెల్లించాలని, 2024 ఆకు సేకరణ బిల్లులు చెల్లించాలని తెలంగాణ ఆదివాసీ గిరిసన సంఘం జిల్లా అధ్యక్షురాలు కొరెంగా మాలశ్రీ డిమాండ్ చేశారు. జిల్లా అటవీ శాఖ కార్యాలయం ఎదుట సంఘం ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యక్షులు కోట శ్రీనివాస్‌తో కలసి ధర్నా నిర్వహించారు. అనంతరం అటవీశాఖ కార్యాలయ సూపరింటెండెంట్ వెంకటకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దహెగాం మండలం ఖర్జి గ్రామానికి చెందిన తునికాకు సేకరణదారుల పెండింగ్ బోనస్, 2024 సీజన్ ఆకు సేకరణ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. 2016 నుంచి తునికాకు బోనస్ పెండింగ్‌లో ఉందని అనేకసార్లు పోరాటం చేసిన ఫలితంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం హడావిడిగా బోనస్ చెల్లించిందని, ఇందులో కూడా 8,000 మంది పెండింగ్ ఉండగా 5000 మందికి మాత్రమే చెల్లించారని ఇంకా 3,000 మందికి చెల్లించాల్సి ఉందన్నారు. ఆసిఫాబాద్ డివిజన్ గిరవెల్లి యూనిట్‌లో, కాగజ్ నగర్ డివిజన్‌లో అయితే 2024 సీజన్‌కి సంబంధించిన ఆకుల కట్టల డబ్బులు సైతం రాలేదని దీనికి అధికారుల తప్పిదమే కారణమని ఆరోపించారు. ఇప్పటికైనా వెంటనే అధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న బోనస్ డబ్బులు చెల్లించాలని, 2024 సీజన్ ఆకు సేకరణ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆకు సేకరణ దారులు ఒడిల హనుమంతు, తుమ్మడే సుగుణ, చౌదరి లక్ష్మి, జునగరి గణేష్, రౌతు వెంకటమ్మ, రౌతు పోసక్క, దన్నూరి శంకర్, కుబిడే బుచ్చన్న, ఒడిల నరేష్, ఒడిల పాపయ్య, బూసి అంజన్న పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ వెంటనే పూర్తి చేయాలి

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఆర్డిఓ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రుణమాఫీ విడతల వారీగా చేస్తామని చెప్పిందని, కొంతమేరకే రుణమాఫీ అయిందని పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని కోరారు. ఇదే సందర్భంలో పట్టా పాస్ బుక్కులలో ఉన్న తప్పులతో అనేకమంది రుణమాఫీకి దూరమయ్యారని, వాటిని వెంటనే సవరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం నాయకులు గొడిసెల కార్తీక్, దుర్గం నిఖిల్ పాల్గొన్నారు.

పేపర్ ఉత్పత్తికి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలి

- సబ్ కలెక్టర్‌ను కోరిన ఎస్పీఎం కార్మికులు, ఉద్యోగులు
- మిల్లు గేటు నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ





నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు పేపర్ మిల్లులో పేపర్ ఉత్పత్తికి ఎలాంటి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్దా శు క్లాను మిల్లు కార్మికులు, ఉద్యోగులు కోరారు. సోమవారం మిల్లు గేటు నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ఉద్యోగులు, కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చి తమ సమస్యలు వివరించారు. 2014 నుండి 2018 వరకు మిల్లు మూసివేసిన సమయంలో తాము తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నామని, ఇపుడు మళ్లీ లారీ అసోషియేషన్ సమ్మెతో అటువంటి పరిస్థితులు ఉత్పన్నమయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నందున ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. లారీ అసోషియేషన్ సమ్మె కారణంగా మిల్లులో పేపర్ నిల్వలు పేరుకుపోతున్నాయని, దీనితో ఆర్డర్లు తగ్గి కంపెనీకి నష్టాలు వచ్చే అవకాశముందని తెలిపారు. నష్టాలు వస్తున్నాయనే సాకుతో మిల్లు యాజమాన్యం లే ఆఫ్ అంటూ మమ్మల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నందున ఈ సమస్యను సానుకూలంగా పరిష్కరించి మమ్మల్ని, మా కుటుంబాలను ఆదుకోవాలని కార్మికులు సబ్ కలెక్టర్‌ను కోరారు.

జన సురక్ష పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-కౌటాల

చింతలమానెపల్లి మండలం డబ్బా గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ కౌటాల శాఖ మేనేజర్ రమేష్ ఆధ్వర్యంలో జన సురక్ష పథకాలపై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాల వివరాలను బ్యాంక్ అధికారులు వివరించారు. డ్వాక్రా రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ బ్యాంక్‌లో తక్కువ వడ్డీతో రుణాలు ఇవ్వడం జరుగుతుందని మేనేజర్ రమేష్ తెలిపారు. 18 సంవత్సరాల నుండి 70 సంవత్సరాల వరకు వయసు గలవారు సురక్ష బీమా యోజన పథకాన్ని కలిగి ఉండాలని సూచించారు. సురక్ష బీమా పథకానికి సంవత్సరానికి గాను రూ.20 ప్రీమియం చెల్లించి రెండు లక్షల ప్రమాద బీమాను పొందవచ్చునని, అలాగే జీవనజ్యోతి బీమా యోజన పథకంలో రూ.436 సంవత్సరానికి చెల్లించి రెండు లక్షల సాధారణ లేదా ప్రమాద బీమా పొందవ చ్చునని తెలిపారు. కళాకారులతో డప్పు వాయిస్తూ పాటలు పాడుతూ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ లావాదేవీలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది డబ్బా సిఎస్పి గంట లక్ష్మి నారాయణ, వీఓ అధ్యక్షురాలు లావణ్య జీవిత నాయకులు దుర్గం రవి, దొంగ్రి సంతోష్, తులసిరాం సీఏ అద్దాల మల్లేష్ ఖాతా దారులు పాల్గొన్నారు.

శివాజీ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శివాజీ జయంతిని అధికారికంగా నిర్వహించాలని కోరుతూ సోమవారం కుంరంభీం ఆసిఫాబాద్ జిల్లా ఆరె సంక్షేమ సంఘం నాయకులు ఆదిలాబాద్‌లో బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఛత్రపతి శివాజీ తన పాలనలో అన్ని కులాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాడని, ఎన్నో ప్రజాహితమైన సంస్కరణలు ప్రవేశపెట్టడం ద్వారా ప్రజల మన్ననలు పొందాడని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. భావితరాలకు ఆదర్శనీయుడిగా నిలిచే ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని ఫిబ్రవరి 19న మహారాష్ట్ర, కర్ణాటక, గోవా రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహిస్తూ సెలవులు ప్రకటిస్తుంటే, మన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. కాబట్టి శివాజీ జయంతిని అధికారికంగా నిర్వహించాలని, ప్రభుత్వ సెలవుదినంగా ప్రకటించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఆరె సంక్షేమ సంఘం కుంరంభీం జిల్లా అధ్యక్షులు బొట్టుపల్లి జయరాం, గౌరవాధ్యక్షులు నారులె వానుపటేల్, జిల్లా ఉపాధ్యక్షులు కోటే బిక్కాజీ, సహాయ కార్యదర్శి ఓమాజీ, సిర్పూరు తాలూకా అధ్యక్షులు చప్పిడె సత్యనారాయణతో పాటు పలు మండలాల నాయకులు ఉన్నారు.

పద్మశ్రీ కనక రాజుకు అధికారుల నివాళి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గుస్సాడి గురువు పద్మశ్రీ కనకరాజుకు ఐటీడీఏ పీఓ కుష్బూ గుప్త, అదనపు కలెక్టర్ దీపక్ తివారిలు మార్లవాయిలోని ఆయన స్వగృహానికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుస్సాడి నృత్యాన్ని ప్రపంచవేదికలపై ప్రదర్శించేలా సేవలందించి సినీప్రముఖులతో శభాష్ అనిపించుకుని అత్యంత ప్రతిష్టాత్మకమైన పద్మశ్రీ పురాష్కారాన్ని అందు కోవడం గర్వకారణమన్నారు. 2021లో రాష్ట్రపతి చేతులమీదుగా అందుకొని గోండు జాతి సంస్కృతిని విశ్వవిఖ్యాతి గవించిన మహనీయునిగా ఎదిగిన గొప్ప వ్యక్తి కనకరాజు అని కొనియాడారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిని రమాదేవి, మాజీ సర్పంచ్ కౌసల్య పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ : గుస్సాడీ కళాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత కనకరాజు మృతి పట్ల సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ సంతాపం తెలిపింది. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్లు కనకరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ మాట్లాడుతూ గుస్సాడీ నృత్యానికి దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన ఘనత కనకరాజుకే దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అసోషియేషన్ నాయకులు నారాయణ, రమణయ్య, రామయ్య, కోటేశ్వర్‌రావు, పురుషోత్తం, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేసిన వారికే గుర్తింపు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

అంకితభావంతో పని చేసిన వారికే బీజేపీలో గుర్తింపు ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేంద్రగౌడ్ అన్నారు. సోమవారం కాగజ్‌నగర్‌కు వచ్చిన ఆయన స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశవ్యాప్తంగా సెప్టెంబర్ 2వ తేదీన పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభమైందని, ఇప్పటి వరకు తెలంగాణలో 27 లక్షల మంది బీజేపీ సభ్యత్వం తీసుకున్నారని తెలిపారు. రాబోయే రోజులలో ఈ సంఖ్య 50 లక్షలకు చేరుకుంటుందని అన్నారు. బీజేపీ అభిమానులకు మాత్రమే తాము సభ్యత్వం ఇస్తున్నామని, పార్టీలో అంతర్గత ఎన్నికల ప్రక్రియ కూడా పూర్తి ప్రజాస్వామ్యబద్ధంగా ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే పూర్తి వ్యతిరేకతను మూటకట్టుకుందని, తెలంగాణలో త్వరలోనే బీజేపీ అధికారంలోకి రానుందని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు కొంగ సత్యనారాయణ, ధోని శ్రీశైలం, వీరభద్రచారి, సిందం శ్రీనివాస్, ఈర్ల విశ్వేశ్వర్‌రావు, దెబ్బటి శ్రీనివాస్, కొప్పుల శంకర్ పాల్గొన్నారు.



ప్రజావాణి సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం ఆసిఫాబాద్ ఆర్డీఓ లోకేశ్వర్ రావుతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారుల సమావేశంలో మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారం కోసం అధికారులు చర్యలు తీసుకోవాలని అప్పుడే సమస్యలతో జిల్లా కేంద్రానికి వచ్చే వారి సంఖ్య తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి



నవతెలంగాణ-కెరమెరి

ఉపాధ్యాయులు సమయ పాలన పాటించి విద్యాభివృద్ధికి కృషి చేయాలని మండల విద్యాధికారి ఆడే ప్రకాష్ అన్నారు. సోమవారం మండలంలోని ఎంపీయూపీఎస్ సుర్ధపూర్ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరు పట్టికలు పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలు, విద్యాబోధనపై అరా తీశారు. పాఠశాలలో నిర్వహిస్తున్న ఎఫ్ఎల్ఎన్, నాస్ పరీక్షల రికార్డుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆరో తరగతి విద్యార్థులకు నిర్వహించే నాస్ పరీక్షల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ప్రధానోపాధ్యాయునికి సూచించారు. అనంతరం అమ్మ కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులను పరిశీలించారు.

అదనపు కలెక్టర్ దాసరి వేణు బదిలీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో రెవెన్యూ విభాగం అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న దాసరి వేణును పెద్దపల్లికి బదిలీ చేస్తూ అక్కడి అదనపు కలెక్టర్ జీవి శ్యాం ప్రసాద్‌ను ఆసిఫాబాద్ బదిలీ చేస్తు రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మీటల ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు 70 మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

గల్లంతైన యువకుని మృతదేహం లభ్యం

బెజ్జూరు-బెజ్జూరు

మండలంలోని సోమిని సమీపంలోని ప్రాణహిత నదిలో స్నానానికి వెళ్లిన ముగ్గురు యువకులు గల్లంతైన ఘటనలో ఇద్దరి యువకుల మృతదేహాలు ఆదివారం లభించగా, సోమవారం మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలోని వెంచపల్లి గ్రామ సమీపంలోని ప్రాణహిత నదిలో మోయిజ్(19) మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ విక్రం తెలిపారు. గల్లంతైన యువకుల ఆచూకీ కోసం మహారాష్ట్ర, తెలంగాణ పోలీసులు సంయుక్తంగా రెస్క్ టీంతో గాలింపు చర్యలు చేపట్టారు. సోమిని సమీపంలో ప్రాణహిత నది నుంచి సుమారు 50కిలోమీటర్ల మేర మోయిజ్ మృతదేహం ప్రాణహిత నదిలో కొట్టుకపోయి కోటపల్లి మండలంలోని ప్రాణహిత నదిలో గుర్తించారు. అక్కడ చేపలు పట్టే మత్స్యకారులు ప్రాణహిత నదిలో కొట్టుకు వస్తున్న మృతదేహాన్ని గుర్తించి స్థానికులకు, పోలీసులకు సమాచారం అందించడంతో బెజ్జూరు, కోటపల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మోయిజ్ మృతదేహంగా గుర్తించి పంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పీవీటీజీల అభివృద్ధికి అన్ని చర్యలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆదివాసి తెగల్లో వెనుకబడ్డ తెగలైన పీవీటీజీల అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి తెలిపారు. మండలంలోని ఆదివాసీ గ్రామమైన బనారుగొంది, కుతోడా లలో ప్రధాన మంత్రి జన్ మన్ పథకం ద్వారా 60 లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన బహుళార్థక భవన నిర్మాణాలకు సింగిల్ విండో ఛైర్మన్ అలీబీన్ అహమ్మద్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచం అభివృద్ధి పథంలో దూసుకుపోతుంటే ఆదివాసీలు ఇంకా వెనుకబడి ఉండడం ఆందోళన కలిగిస్తుందన్నారు. వారి అభివృద్ధి కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. పీఎం జన్ మన్ పథకం ద్వారా పీవీటీజీల అభివృద్ధి కోసం మౌలిక వసతుల కల్పన కోసం విడుదలవుతున్న నిధులు సక్రమంగా వారికి వినియోగించేలా చూస్తానని తెలిపారు. ఆదివాసులు ప్రభుత్వాలు అందిస్తున్న సహకారాలను సద్వినియోగం చేసుకుని ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ డీఈ నిజాముద్దీన్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గో హోమ్ డెలివరీ వినియోగించుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆర్టీసీ ద్వారా త్వరలో రాష్ట్రంలోని ప్రధాన పట్టణాల్లో ప్రారంభం కానున్న కార్గో హోమ్ డెలివరీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ విశ్వనాథ్ ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే ఈ నెల 27వ తేదీన హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలలో సర్వీసులు ప్రారంభమయ్యాయని త్వరలో రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు వివరించారు. ఇతర వివరాలకు 9154298534 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

బెటాలియన్ ముందు కొనసాగుతున్న బందోబస్తు

నవతెలంగాణ-హాజీపూర్



ఏక్ పోలీస్ విధానం అమలు చేయాలని గత ఐదు రోజులుగా కొనసాగుతున్న ఆందోళనల్లో భాగంగా గుడిపేట్-13వ బెటాలియన్ ముందు సివిల్ పోలీస్ బందోబస్తు కొనసాగుతుంది. మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, హాజీపూర్ ఎస్ఐ గోపతి సురేష్ ఆధ్వర్యంలో 20 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. బెటాలియన్ నుంచి ఎవరు రోడ్డుపైకి వచ్చి ధర్నాలు చేయకుండా గట్టి పహారా ఏర్పాటు చేశారు. మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ సోమవారం బెటాలియన్ ముందు బందోబస్తును పరిశీలించారు. కాగా బెటాలియన్ పోలీస్‌లు రొడ్డుపైకి రాకుండా బెటాలియన్ లోపలనే తమ న్యాయమైన డిమాండ్ల కోసం నిరసన తెలుతున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తన తదుపరి నిర్ణయం ఆందోళనలు వుంటాయని తెలిపారు.

స్కూల్ గేమ్స్‌లో సత్తా చాటిన విద్యార్థులు

నవతెలంగాణ-జన్నారం

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14, అండర్-17 విభాగంలో ఉమ్మడి ఆదిలాబాద్ జోనల్ స్థాయి బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌లో సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు స్లేట్ పాఠశాల ప్రిన్సిపల్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి, తెలిపారు. 27న మంచిర్యాల జిల్లాలోని బాయ్స్ హై స్కూల్‌లో నిర్వహించిన జోనల్ స్థాయి బాస్కెట్ బాల్ టోర్నీలో స్లేట్ పాఠశాలకు చెందిన 7 గురు విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. అండర్-17 బాలుర విభాగంలో జి.సాయి చరణ్, వి.రోహన్ రావు, అండర్-17 బాలికల విభాగంలో అయేశ అలాగే అండర్-14 బాలుర విభాగంలో యు అభినవ్, టి శ్రీశాంత్, అండర్-14 బాలికల విభాగంలో అక్షిత, చైత్రలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తరుపున రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తరుపున రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను స్లేట్ హై స్కూల్ డైరెక్టర్ ఏనుగు రజితరెడ్డి, ప్రిన్సిపాల్ శిరిన్ ఖాన్, వ్యాయామ ఉపాధ్యాయులు సంతోష్, ఎం నగేష్, జ్యోష్న అభినందించారు.

గిరిజన గ్రామాల్లో ఘనంగా దండారీ ఉత్సవాలు

- భక్తిశ్రద్ధలతో పాల్గొన్న ఆదివాసులు



నవతెలంగాణ-హాజీపూర్

మండలంలోని గిరిజన గ్రామాలైన మోర్రిగూడెం, నాగారం, చిన్నగోపాల్పూర్ గ్రామాల్లో దండారీ ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. దీపావళి పండగ సందర్భంగా గోండు తెగకు చెందిన ఆదీవాసులు ఎత్మల్సార్-గుమ్మెల దండారీ ఉత్సవాలకు ఆదివారం శ్రీకారం చుట్టగా ఈ ఉత్సవాలు నాలుగు రోజుల పాటు నిర్వహిస్తారు. నాలుగు నెలల నుంచే ప్రారంభమయ్యే ఈ ఉత్సవం దీపావళికి ముందుగా అత్యంత భక్తిశ్రద్ధలతో దండారీ ఉత్సవాలను ఆదీవాసీలు తమ కుటుంబ సభ్యులు, స్థానికులతో కలిసి సమిష్టిగా జరుపుకుంటున్నారు. నెమలి ఈకలు, డప్పులతో పాటు ఆరాధ్య దేవతకు ప్రత్యేక మొక్కులు చెల్లించుకుంటూ చిన్నా, పెద్దా, ఊరూ, వాడా అంతా బాగుండాలని కోరుకుంటూ ప్రత్యేక వేషాధారణలతో సంప్రదాయ కృత్యాలు చేస్తూ భక్తి పాటలతో ఉత్సవాలు నిర్వహిస్తారు. ఊరు పోచమ్మ, హనుమాన్ ఆలయాలతో పాటు సకల దేవతలను కొలుస్తూ టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. దీపావళి మరుసటి రోజున ముగిసే దండారీ ఉత్సవాల్లో భాగంగా గంగస్నానాలు ఆచరించి పూజలతో ముగిస్తారు. ఈ కార్యక్రమంలో నాగారం దండారి అధ్యక్షుడు పెంద్రం మారు, సోనేరావు, గౌడే శ్రావణ్, కొడప సురేష్, అనిల్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గీతా ప్రశాంతి నిలయంలో యజ్ఞం, కుంకుమ పూజలు

నవతెలంగాణ-నస్పూర్

శ్రీమద్భవద్గీత సత్సంఘం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నస్పూర్ కాలనీ వెంకటేశ్వర ఆలయంలో శ్రీ గీతా ప్రశాంతి నిలయంలో 22వ వార్షికోత్సవం పురస్కరించుకొని సోమవారం యజ్ఞం, కుంకుమ పూజలు నిర్వహించారు. తీర్థ ప్రసాద వితరణ అన్నదాన కార్యక్రమం చేశారు. వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 21 నుంచి 27 వరకు సప్తాహం రోజు రెండు అధ్యాయాలు గీతా పారాయణం, విష్ణు సహస్ర పారాయణం శ్రీమద్భవద్గీత సత్సంఘం అధ్యక్షుడు దాసరి భక్త రాజేశం ప్రవచనాలు చేశారు. గీత ఆవరణ వెంకటేశ్వర అభిషేకము, నవగ్రహ పూజ, గణపతి పూజలు, శ్రీకృష్ణుని అభిషేకం, తులసి మాత పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ డీడీ ప్రసాద్, కార్యదర్శి సీహెచ్ రాంబాబు, ఆరు మల్లేష్, జే సమ్మయ్య, లక్ష్మీనారాయణ, సాంబార్ రాజన్న, దాసరి రాజేశ్వరి, శ్రీలక్ష్మి, పి మల్లేష్, ఎస్ శంకరయ్య, పి శంకర్, ప్రచార కార్యదర్శి మారపల్లి సారయ్య పాల్గొన్నారు.

నిబద్ధత గల ఉద్యోగికి సమాజంలో గుర్తింపు

- జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్

నవతెలంగాణ-లక్షెట్టిపేట

నిబద్ధతతో విధులు నిర్వహించిన ఉద్యోగికే సమాజంలో గుర్తింపు లభిస్తుందని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్ అన్నారు. లక్షెట్టిపేటలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టంలో అడిషనల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కోడం వెంకటరమణ ఉద్యోగ విరమణ అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విధులు నిర్వహించడంతోపాటు తోటి సిబ్బందితో పనిచేయించడంలో వెంకటరమణలకు ఎవరు సాటిలేరని కొనియాడారు. ఈ సందర్భం ఏపిఓ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సరోజ, నాగేశ్వర్‌రెడ్డి, ఎంపీఓలు శ్రీనివాస్, ప్రసాద్, హెచ్ఆర్ మేనేజర్ రమేష్, ఏపీఓ అసోసియేషన్ అధ్యక్షుడు దుర్గాదాస్, ఈసీస్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, టెక్నీకల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, పంచాయతీ సెక్రెటరీస్ నాయకులు రాజేష్, హరికృష్ణ, సుజాత, వంశీ, ఫీల్డ్ అసిస్టెంట్స్ అధ్యక్షుడు రేగుంట సతీష్, మోహన్ పాల్గొన్నారు.

గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు అరెస్ట్

నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుబ్బగూడెంలో గంజాయి అక్రమ రవాణా చేస్తూ విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ కుమార్ తెలిపారు. సోమవారం కాసిపేట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మందమర్రి ఎస్ఐ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తూండగా కాసిపేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దుబ్బగూడెం గ్రామ శివారు నీలగిరి చెట్లలో కోమటి చేను గ్రామానికి చెందిన జాడి దిలీప్, జాడి మొగళి, మంచిర్యాలకు చెందిన రాంటెంకి మధూకర్లు గంజాయిని దుబ్బగూడం నీలగిరి చెట్ల కింద అమ్ముతుండగా వారిని పట్టుకుని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి రూ.2250 విలువ గల 90 గ్రాముల గంజాయి, స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. స్కూటీ, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

పత్తి అమ్మేందుకు మార్గదర్శకాలు పాటించాలి

నవతెలంగాణ-జైపూర్



పత్తి పంటను సాగు చేస్తున్న రైతులు సీసీఐకి విక్రయించుకోవాలంటే తప్పని సరిగా మార్గదర్శకాలు పాటించాలని సీసీఐ మార్గదర్శకాలను విడుదల చేసింది. ప్రధానంగా 8 నుండి 12 శాతానికి మించిన తేమ ఉండరాదు. పంటను విక్రయించుకోవడానికి వెలుతున్న రైతు విధిగా పట్టాదార్ పాసుపుస్తకం, ఆధార్‌కార్డుతో పాటు ఆధార్ లింకు కలిగివున్న మొబైల్ ఫోన్ అందుబాటులో ఉంచుకోవాలి.. రైతుకు సంబందించిన ఆధార్ సమాచారాన్ని సీఐడీఆర్ డేటా బేస్ సరిపోల్చినప్పుడు రైతు పేరు, పుట్టిన తేది, లింగం మొదలగునవి తెలియజేస్తుంది..బయోమెట్రిక్ ధృవీకరణ అనుకున్నప్పుడు వేలి ముద్రలు, కనుగుడ్ల స్కాన్ చేసి ఆధార్ డేటాతో సరిపోల్చడం జరుగుతుంది. ఓటీపీ ఆధారిత ధృవీకణ అంటే ఆధార్‌తో లింక్ అయిన మొబైల్ ఫోన్ నెంబర్‌కి వచ్చిన ఓటీపీని ఉపయోగించి ధృవీకరిస్తారు. అదేవిధంగా బ్యాంక్ అకౌంట్ లింకింగ్‌తో నగదు చెల్లింపులకు సంబంధించి యూఐడీఏఐ.జీఓవీ.ఐన్, డీబీటీబీహెచ్ఏఆర్ఈటీ.జీఓవీ.ఇన్ వెబ్సైట్ ద్వార బ్యాంకు సీడింగ్ తనిఖీ చేసుకునే అవకాశం ఉంటుంది. కాగా మార్కెటింగ్ శాఖ రైతుల సౌకర్యార్థం ప్రతి కొనుగోలు సంబందించిన సేవలు అందించేందుకు 8897281111 వాట్సాప్ మొబైల్ ఫోన్ నెంబర్ ద్వార రైతులు ఆరి పత్తి పంట అమ్మకం, ఎంత పత్తి అమ్మడానికి అవకాశం ఉంది అని తెల్సుకోవచ్చు. అదేవిధంగా తాకా పట్టి వివరాల స్థితి, సీసీఐ సెంటర్‌లో రైతులు వేచి ఉండే సమయం, కొనుగోలు వివరాలు తదితర అంశాలు ఈ వాట్సాప్ మొబైల్ నెంబర్‌కి చాట్ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. 2024-25 పత్తి పంట కొనుగోళ్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రైతుకు మద్దతు ధర కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు పత్తి పంటకు కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ. 7,521తో సీసీఐకి రైతులు పత్తి పంటను అమ్ముకోవడం కోసం పైన తెలిపిన మార్గదర్శకాలు విడుదల చేసింది. కాగా ప్రభుత్వ ప్రకటించిన పత్తి పంట మద్దతు ధర చూస్తే పింజరకం బీబీ మోడ్ రకం క్వింటాలుకు రూ.7,521, పింజరకం బీబీ ఎస్‌పీఎల్ క్వింటాలు ధర రూ.7,471, పింజరకం ఎంఈసీహెచ్ క్వింటాలుకు రూ. 7,421తో సీసీఐ కొనుగోళ్లకు అంగీకరించిది. అయితే 8 శాతం తేమ ఉన్నప్పుడే ఈ ధర గిట్టుబాటు అవుతుంది. ఒక 9 శాతం ఉంటే రేటు తగ్గిస్తుండగా 8 నుండి 12 శాతం తేమ ఉన్నటువంటి పత్తి పంట కొనుగోలు చేస్తున్నప్పుడు 8 శాతం ఉంటే ప్రకటించిన ధరతో కొనుగోలు చేయనున్నారు. తేమ శాతం పెరిగినప్పుడు గిట్టుబాటు రేటులో కూడా తేడాతో ప్రకటించిన ధరతో పత్తి పంటను విక్రయించాల్సి వస్తుంది.

దళారులను నమ్మి మోసపోవద్దు

అత్తే సుధాకర్, మండల వ్యవసాయ అధికారి, భీమారం



రాత్రింబవళ్లు శ్రమించి పండించిన పంటలను దళారులకు అమ్ముకోకుండా సీసీఐకి అమ్ముకోవడంతో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర లభిస్తుంది. మండల పరిధిలో పత్తి పంట చేతికందే సమయం ఆసన్నమైనందున సూచించిన మార్గదర్శకాలను అనుసరించి పంటను అమ్ముకోవడంతో రైతుకు గిట్టుబాటు అవుతుంది. మండల పరిధిలో 4,097 ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తున్న రైతులు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలి. దళారుల దరి చేరకుండా మార్గదర్శకాల్లో సూచించిన విధంగా 8 నుండి 12 తేమ శాతం ఉండే విధంగా చూసుకుని కొనుగోలు కేంద్రాలకు పత్తి పంటను తరలించాలి. దళారులను ఆశ్రయిస్తే అతి తక్కువ ధరతో అమ్ముకోవల్సి వస్తుంది.

విజిలెన్స్ అవగాహన వారోత్సవాల ప్రతిజ్ఞ



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో సోమవారం విజిలెన్స్ అవగాహన వారోత్సవాల ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జీఎం బి సంజీవరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు సోమవారం నుంచి నవంబర్ 3వ తేది వరకు జరుపుకుంటున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం మనం విజిలెన్స్ వారోత్సవాలను జరుపుకుంటున్నామని దీనిలో భాగంగా మనమందరం అవినీతికి వ్యతిరేకంగా ప్రతిన పూనాలని, ఈ సందర్భంగా మనం అవినీతి రహిత భారతదేశం-అభివృద్ధి చెందిన దేశం అనే నినాదంతో ముందుకు వెళ్లాలని తద్వారా సంస్థ, దేశ అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. 2024 సంవత్సర స్లోగన్ 'సమగ్రత సంస్కృతి-దేశ పురోభివృద్ధి' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టూ జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు కే వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎం పర్సనల్ అరవింద రావు, డీజీఎం ఐఈడీ చిరంజీవులు, ఏరియా సర్వే అధికారులు వెంకటేశం, డీజీఎం లా శిరీషరెడ్డి, ఫారెస్ట్ ఆఫీసర్ చంద్రమణి పాల్గొన్నారు.

పట్టభద్రుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తా

- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సర్దార్ రవీందర్ సింగ్

నవతెలంగాణ-లక్షెట్టిపేట



పట్టబద్రులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తానని అదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ అన్నారు. సోమవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలో పర్యటించారు. పర్యటనలో భాగంగా మున్సిపల్ చైర్మన్ నల్మస్ కాంతయ్య నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. అనంతరం కోర్టు బార్ అసోసియేషన్ సభ్యులను, న్యాయవాదులను కలిసి పట్టబద్రులు అందరూ తమ ఓటు నమోదు చేసుకొని తనకు మద్దతు తెలిపాల్సిందిగా కోరారు. పట్టణంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పట్టభద్రులతో సమావేశమై ఎన్నికల్లో తనకు మద్దతు తెలిపాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రులకు సముచిత స్థానం కల్పించడమే కాకుండా వారి సమస్యల పరిష్కారానికి వారధిగా ఉంటానని పేర్కొన్నారు. పట్టభద్రుల ఎన్నికలలో అతి కీలకమైన ఓటర్ నమోదు ప్రక్రియలో ప్రతి ఒక్క పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని, నిబద్ధత, అంకితభావం కలిగిన తనను ఎన్నికలలో తనను మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఈ సమావేశాల్లో సంబంధిత విద్యాసంస్థల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌కు తరలివెళ్లిన బీసీ నాయకులు



నవతెలంగాణ-జన్నారం

స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు పెంపు అంశంపై తెలంగాణ బీసీ కమిషన్ సభ్యుల బృందం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో చేపట్టిన బహిరంగ విచారణకు మండల కేంద్రం నుంచి బీసీ నాయకులు సోమవారం బయలుదేరారు. ఈ విచారణకు బీసీ కమిషన్ చైర్మన్ జి నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాల లక్ష్మి, సభ్య కార్యదర్శి బాల మాయా దేవితో కూడిన బృందం హాజరవుతున్నట్లు తెలిపారు. బిసి కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కో కన్వీనర్ కడార్ల నరసయ్య మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ కులాల వారికి 52 శాతం రిజర్వేషన్ కల్పించుటకు బీసీ కమిషన్ చైర్మన్ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కోర నునంటట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం కరీంనగర్ జోన్ కన్వీనర్ కేప నరసింహులు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కోదూరి చంద్రయ్య, కోకన్వీనర్ మూల భాస్కర్ గౌడ్, మంచిర్యాల జిల్లా కన్వీనర్ ఆడేపు లక్ష్మీనారాయణ కో కన్వీనర్ బాలసాని శ్రీనివాస్ గౌడ్, మున్నూరు కాపు సంఘం పవన్ కళ్యాణ్, పట్టణ ఉపాధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, జన్నారం మండల బీసీ సంఘం అధ్యక్షుడు గూడ అశోక్, పురగిరి క్షత్రియ, పెరిక సంఘం అధ్యక్షుడు ఎంబడి సత్తన్న తదితరులు తరలి వెళ్ళినారు.

ఉచిత కంటి వైద్య శిబిరాల ద్వారా సేవలు : సుకేష్



నవతెలంగాణ-జైపూర్

చూపు ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి వైద్య సేవలు అందించేందుకు సాధ్యమైనంత వరకు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని మంచిర్యాలకు చెందిన కంలేశ్వర నేత్ర వైద్యశాల వైద్యులు సుకేష్ తెలిపారు. షెట్‌పల్లి గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఉచిత కంటి వైద్య శిభిరం ద్వార గ్రామానికి చెందిన చూపు సమస్య ఉన్న 60 మందికి వైద్య పరిక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో కొంత మందికి కంటి అద్దాలు అవరమవుతుండగా మరికొంత మందికి ఆపరేషన్ అవసరమవుతున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల వారికి ప్రత్యేక వైద్య శిభిరాలు ద్వార ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామని, వెసులుబాటు మేరకు అవసరమైన ప్రతి గ్రామ పంచాయతీలో వైద్య శిభిరం ఏర్పాటు చేసి ఉచితంగా వైద్య సేవలు అందించనున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ మేడి రవి, గ్రామ పంచాయతీ ప్రజలు, యువకులు పాల్గొన్నారు..

విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిస్తాం

నవతెలంగాణ-జైపూర్

మండలంలోని మిట్టపల్లి గ్రామ పంచాయతీ కార్యిదర్శి ప్రవీణ్‌పై వచ్చిన ఆరోపణల మేరకు విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిస్తామని డీఎల్‌పీఓ ధర్మారాణి తెలిపారు. మిట్టపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి జీ ప్రవీణ్ విధులకు హాజరు కాకుండా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందున గ్రామ పంచాయతీ అభివృద్ధి కుంటుపడుతుందని గ్రామానికి చెందిన తరుణ్ కలెక్టర్ కార్యాలయంలో పిర్యాదు చేశారు. ఈ క్రమంలో జిల్లా ఉన్నతాధికారి ఆదేశాల మేరకు సోమవారం మిట్టపల్లి గ్రామంలో పిర్యాదుదారు తరుణ్‌తో పాటు మాజీ వార్డు సభ్యులు సమక్షంలో డీఎల్‌పీఓ ధర్మారాణి విచారణ చేపట్టారు. విచారణకు హాజరైన మాజీ వార్డు సభ్యులతో పాటు గ్రామస్థుల వాగ్మూలం తీసుకున్న డీఎల్‌పీఓ పూర్తి సమాచారాన్ని తదుపరి చర్యల నిమిత్తం జిల్లా పంచాయతీ అధికారికి అందజేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీఓ శ్రీపతి బాపురావు, గంగిపల్లి, మిట్టపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శులు సత్యనారాయణ, ప్రవీణ్, మాజీ వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు..

విద్యార్థుల హాజరు శాతం పెంచడానికి కృషి చేయాలి

- భీమారం ఎంపీడీఓ మధుసూదన్

నవతెలంగాణ-జైపూర్



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంపీడీఓ మదుసూధన్ సూచించారు. సోమవారం రెడ్డిపల్లి, ధర్మారం గ్రామాలను సంధర్శించిన ఆయన ప్రాథమిక పాఠశాలను సంధర్శించి విద్యార్థుల హాజరు శాతం పరిశీలించారు. పాఠశాల ప్రారంభానికి ముందు గ్రామంలో తిరిగి ప్రతి విద్యార్థి పాఠశాలకు హాజరయ్యే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. అదేవిధంగా స్థానికంగా ఉన్నటువంటి అంగన్‌వాడీ కేంద్రాన్ని సంధర్శించిన ఆయన కేంద్రానికి వచ్చే పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రం రికార్డులు, నిల్వలు పరిశీలించారు. అదేవిధంగా రెడ్డిపల్లి, ధర్మారం గ్రామ పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేయనున్న నర్సరీలను సంధర్శించారు. మొక్కల పెంపకానికి అవసరమైన బ్యాగులను మట్టితో నింపించడంపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జీనత్ పాల్గొన్నారు.

గిరిజన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడాలి

- తెలంగాణ గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి
- గుడిరేవు పద్మల్ పురి కాకో దేవాలయంలో గిరిజనుల దర్బార్
- ఆకట్టుకున్న గుస్సాడి సంప్రదాయ నృత్యాలు



నవతెలంగాణ-దండేపల్లి

గిరిజన సంస్కృతి సాంప్రదాయలను కాపాడుకోవాలని తెలంగాణ గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి కోరారు. సోమవారం మండలంలోని గుడిరేవు గోదావరి నది తీరాన గల పద్మల్ పురి కాకో దేవాలయంలో దండారి ఉత్సవాల్లో భాగంగా గుస్సాడీ దర్బార్ ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ఉమ్మడి జిల్లా నలుమూల నుండే కాకా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుండి పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఛత్తీస్గడ్ నుండి ఆదివాసీ గిరిజనులు అధిక సంఖ్యలో హాజరైనట్లు ఆలయ చైర్మన్ కుడిమేత సోము తెలిపారు. ముందుగా గిరిజనులు సమీప గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి తమ సాంప్రదాయ వేశాదారనతో దండారిలతో కుటుంభ సమేతంగా ఉత్సవాలకు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి యేట దీపావళి పాండగకి ముందు నిర్వహించే ఈ ఉత్సవాలను గిరిజనులు ఎంతో భక్తి శ్రద్దలతో జరుపుకుంటారు.



గిరిజనులు తమ సంప్రదాయ వేషదారణతో చేసిన గుస్సాడి నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కేస్లాపూర్, జోడేఘాట్ దర్బార్‌లకు అధికారులు నాయకులు వచ్చి వెళ్తున్నారు కానీ ధర్బార్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. నేటికి కనీస వసతులు లేని గిరిజన గ్రామాలున్నాయని వారిని పట్టించుకునే వారె లేరన్నారు. ప్రభుత్వం అన్ని పండగలకు నిధులు ఇస్తున్నట్లే ఏడాదికోసారి వచ్చే తమ పండగకు కూడా నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దండారి ఉత్సవాలకు ముఖ్య అథితులుగా మంచిర్యాల డీసీపీ భాస్కర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథరావు హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కర్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తుడుం దెబ్బ జిల్లా నాయకుడు సోయం జంగు, ప్రధాన్ సంఘం జిల్లా నాయకుడు ఆడయి కాంతరావు, కుమురం లింగారావు, పెంద్రమ్ శ్రీనివాస్, రామ్ పటేల్, దామ్ పటేల్, జలపతి, మోహన్ రావు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
మంగళవారం | అక్టోబర్ 29, 2024 | www.navatelangana.com

బదిలీపై వెళ్తున్న కమిషనర్‌కు వీడ్కోలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ నుంచి నిర్మల్‌కు బదిలీపై వెళ్తున్న మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్‌ను కాంగ్రెస్ కౌన్సిలర్లు సన్మానించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో శాలువాతో సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ జహీర్ రంజాని, కౌన్సిలర్లు బండారి సతీష్, సంద నర్సింగ్, జాఫర్, భూమన్న, రామ్‌కుమార్ ఉన్నారు.

ఘన్‌పూర్ చెక్‌పోస్ట్ వద్ద దేశీదారు పట్టివేత

నవతెలంగాణ-బోథ్



మండలంలోని ఘన్‌పూర్ అంతరాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద దేశీదారు పట్టుకున్నట్టు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గుర్రాల తండ గ్రామానికి చెందిన చవాన్ సంజయ్, సోలంకి లఖాన్‌సింగ్‌లు సోమవారం మహారాష్ట్ర నుంచి ఏపీ 01ఏఈ 1583 వాహనంపై గుర్రాల తండ గ్రామానికి అక్రమంగా రవాణా చేస్తున్న 190 దేశీదారు మద్యం బాటిల్‌లను పట్టుకొని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఐటీడీఏ పరిధిలోని ప్రతి దండారీకి రూ.15వేలు

నవతెలంగాణ-ఉట్నూర్

ఐటీడీఏ పరిధిలోని ప్రతి దండారీకి రూ.15వేల చొప్పున కేటాయించడం జరిగిందని ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి, ఇన్‌చార్జీ మంత్రి సీతక్క సహకారంతో ఐటీడీఏ పరిధిలోని వేయి గ్రామాల్లో దండారీకి రూ.15 వేల చొప్పున ప్రభుత్వం రూ.1కోటి 50 లక్షలను దీపావళి కానుకగా కేటాయించిందని తెలిపారు. ఆదివాసీ, గిరిజన సంస్కృతి సాంప్రదాయాలను గౌరవిస్తూ, కాపాడుకుంటూ భావితరాలకు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

డీఎస్సీ స్పెషల్ ఎడ్యుకేషన్ అభ్యర్థుల ధృవ పత్రాల పరిశీలన

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

డీఎస్సీ-2024 ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్, స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్, 1:3 అభ్యర్థుల ధృవ పత్రాల పరిశీలన 29న ఉదయం 10గంటల నుంచి నిర్వహించబడుతుందని డీఈఓ డా.ఏ.రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. డీఎస్సీ 2024లో ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ 23 పోస్టులు, స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ 5పోస్టులకు అభ్యర్థుల 1:3 లిస్టును డీఈఓనిర్మల్.వీబీ.కమ్ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్టు తెలిపారు. అభ్యర్థులు అందరికి ఫోన్, మెసేజ్‌ల ద్వారా కూడా సమాచారం అందించబడిందని పేర్కొన్నారు. ఈ లిస్టులో ఉన్న అభ్యర్థులు మాత్రమే 29 అక్టోబర్ 2024 మంగళవారం ఉదయం 10గంటలకు కొత్త కలెక్టరేట్ నిర్మల్ ఆఫీస్ జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం, రెండవ అంతస్తు ఎస్-17కి వచ్చి ఉదయం 10గంటల నుంచి తమ ఒరిజినల్ క్వాలిఫికేషన్ సర్టిఫికెట్స్, రెండు జతల సెట్లపై జిరాక్స్‌లపై గజిటెడ్ ధ్రువీకరణ చేయించి, వెరిఫికేషన్ చేయించుకోవాల్సిందిగా, 4 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు జత చేయాలని తెలిపారు.

నవంబర్ చివరివారంలో రెండు వైజ్ఞానిక ప్రదర్శనలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక్ ప్రదర్శన, ఇన్‌స్పైర్ అవార్డులు, జిల్లా స్థాయి ఎగ్జిబిషన్, ప్రాజెక్ట్ కాంపిటీషన్ ఈ రెండు విజ్ఞాన ప్రదర్శనలు నవంబర్ చివరి వారంలో నిర్వహించనున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ప్రణీత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో 6 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. జిల్లా నుంచి 2023-24 సంవత్సరానికి మొత్తం 63 ఇన్‌స్పైర్ అవార్డులు మంజూరైనట్టు పేర్కొన్నారు. వీరందరి సొంత ఖాతాలలో రూ.పదివేలు జమచేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికైన 63 మంది విద్యార్థులు మాత్రమే పాల్గొనడానికి అర్హత అని, ఎంపిక కాబడిన విద్యార్థి మాత్రమే, ఎంపిక కాబడిన ప్రదర్శనతో పాల్గొనాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. వివరాలకు సైన్స్ అధికారి కె.రఘు రమణ 9440060288ను సంప్రదించాలని సూచించారు.

జంగుబాయి దేవస్థానంలో దండారి ఉత్సవాలు



నవతెలంగాణ-నార్నూర్

కెరమెరి మండలంలోని కోటా పరందోలి జంగు బాయి దేవస్థానంలో దండారి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం గాదిగూడ మండలంలోని హీరాపూర్ గ్రామ ఆదివాసులు సంస్కృతి సాంప్రదాయాల బద్ధంగా భోగి పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు, గుస్సాడీలు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ మెస్రం రాజు, మెస్రం మోతీరాం, ఆత్రం శంభు, ఆత్రం జంగు, మెస్రం కేశవ్ రావ్ ఉన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి



నవతెలంగాణ-భైంసా

ప్రతి గ్రామంలో బీజేపీ క్రియాశీలక సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని, బీజేపీ జిల్లా అధ్యక్షులు అంజు కుమార్‌రెడ్డి సూచించారు. సోమవారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో ఏర్పాటు చేసిన మండల ఇన్‌చార్జీల సమావేశంలో క్రియాశీల సభ్యత్వ నమోదు ప్రారంభించి, మాట్లాడారు. వంద మంది సభ్యత్వ నమోదు చేసిన వారికి మాత్రమే పార్టీ సంస్థాగతంగా పదవులు ఇవ్వబడతాయని అన్నారు. ఎన్నికల్లో పోటీ చేయడానికి సభ్యత్వ నమోదు చేసిన వారికే ప్రాధాన్యత ఇస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా క్రియాశీల సభ్యత్వ నమోదు ఇన్‌చార్జ్ సామ రాజేశ్వర్ రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు సాగర్, బీజేపీ నియోజకవర్గ అసెంబ్లీ కోకన్వీనర్ సుమన్, బీజేపీ సభ్యత్వ నమోదు జిల్లా కోఆర్డినేటర్ సిరం సుష్మరెడ్డి, భైంసా మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ రాజేష్ బాబు, బీజేపీ పట్టణాధ్యక్షులు మల్లేష్, మండల అధ్యక్షులు భూమేష్, కుభీర్ మండలాధ్యక్షులు యేశాల దత్తాత్రి, జిల్లా కార్యదర్శి నల్ల రమేష్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని ఆస్పత్రులపై కఠిన చర్యలు

- జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జాన్‌బాబు



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్-2010, రూల్స్-2022 అన్ని ఆస్పత్రులు విధిగా పాటించాలని, నియమ నిబంధనలు ఉల్లంఘించిన ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రజా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జాన్‌బాబు అన్నారు. సోమవారం జిల్లాలోని పలు ప్రయివేటు ఆస్పత్రులను కెమికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్, జోనల్ టాస్క్‌ఫోర్స్ బృందం, ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జాన్‌బాబు మాట్లాడారు. ప్రతి ఆస్పత్రిలో సేవల రుసుములను తెలిపే చార్ట్‌ను ప్రదర్శించాలని, దాని కనుగుణంగానే రుసుములు తీసుకోవాలన్నారు. అన్ని ఆస్పత్రుల్లో చికిత్సలు అందించే వైద్యుల పేర్లు, వారి అర్హతలు తెలిపే పత్రాలను ప్రదర్శించాలని అన్నారు. వైద్యులు మారినట్లయితే విధిగా జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీకి తెలియజేయాలన్నారు. బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్, పొల్యూషన్, ఫైర్‌సేఫ్టీ ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలన్నారు. ప్రతి ఆస్పత్రిలో రోగులకు అవసరమైన కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయాలన్నారు. గాయత్రి ఆస్పత్రిలో పలు లోపాలను గుర్తించారు. పనిచేసే వైద్యులు, సిబ్బంది తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్, పారామెడికల్ బోర్డు రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రవీందర్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, బృందం సభ్యులు, సీనియర్ అసిస్టెంట్ సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతోనే కేసులు పరిష్కారం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

న్యాయవాదులు, న్యాయమూర్తుల సమన్వయంతోనే కేసులు త్వరతగతిన పరిష్కారం అవుతాయని ప్రిన్సిప్, జూనియర్ సివిల్ జడ్జీ, జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ హుస్సేన్ అన్నారు. సోమవారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులతో ఆయన సమావేశమయ్యారు. ముందుగా న్యాయవాదులు ఆయనకు పరిచయం చేసుకొని స్వాగతం పలికారు. అనంతరం పలు విషయాల గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రిన్సిప్, జూనియర్ సివిల్ జడ్జీ, జూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ హుస్సేన్ మాట్లాడుతూ కోర్టుల్లో కేసుల పరిష్కారంలో న్యాయవాదులు, న్యాయమూర్తులు సమన్వయంతో కృషి చేయాల్సి ఉంటుందన్నారు. చిన్నచిన్న విషయాలను పట్టించుకోకుండా ముందుకు సాగాలని సూచించారు. ఇప్పటివరకు ఎలా కొనసాగిందో తెలియదని, తాను వచ్చిన తరువాత అలానే కొనసాగించాలన్నారు. కేసులను త్వరతగతిన పరిష్కరించేలా న్యాయవాదులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్, ప్రధాన కార్యదర్శి సంతోష్, కోశాధికారి రమణయ్య, రవీందర్, చందుసింగ్, అమరేందర్‌రెడ్డి, తుడూరి శ్రీనివాస్, సదీర్, దాసరి గంగారాం, మోహన్ సింగ్, రజిత పాల్గొన్నారు.

విద్యార్థుల తాగునీటి సమస్య పరిష్కారం



నవతెలంగాణ-తాంసి

మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలతో పాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నీటి సమస్య ఉండటంతో గత నాలుగు రోజుల కింద ఆశ్రమ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి వచ్చిన ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్ విద్యార్థులు సమస్యను వివరించారు. వసతి గృహంతో పాటు పక్కనే ఉన్న హైస్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా మధ్యాహ్న భోజనం తర్వాత విద్యార్థులు తాగునీటి కోసం హై స్కూల్ బయట ఉన్న చేతి పంపు దగ్గరకు వెళ్లడాన్ని ఎమ్మెల్యే గమనించి, సమస్య గురించి అడగగా మాజీ సర్పంచ్ కృష్ణతో పాటు సిబ్బంది నీటి సమస్య ఉందని తెలిపారు. బోర్ వేయించాలని కోరారు. స్పందించి సోమవారం ఇచ్చిన మాట ప్రకారం ఆశ్రమ పాఠశాలతో పాటు హైస్కూల్లో ఐటీడీఏ నిధులతో రెండు బోర్లు వేయించగా నీళ్లు పుష్కలంగా పడటంతో విద్యార్థులతో పాటు సిబ్బంది ఆనంద వ్యక్తం చేసి ఎమ్మెల్యేకు, ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ పాలనలోనే దేశం అభివృద్ధి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

కేంద్రంలోని బీజేపీ పాలనలోనే దేశం అభివృద్ధి చెందుతుందని, యువత బీజేపీ సభ్యత్వం తీసుకోవాలని, రాష్ట్ర నాయకులు రితేష్ రాథోడ్ అన్నారు. సోమవారం మండలంలోని అంబేద్కర్ చౌక్‌లో స్టాల్ ఏర్పాటు చేసి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ ప్రపంచంలోనే భారతదేశాన్ని అగ్రగామి దేశంగా చేయాలనే లక్ష్యంతో అన్ని దేశాలతో సంబంధాలు ఏర్పరచుకొని, అభివృద్ధికి బాటలు వేస్తున్నారని అన్నారు. మండలంలోని బూత్‌లలో ప్రతి బూత్‌కు 200 మందిని సభ్యత్వం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన మోర్చ జిల్లా అధ్యక్షులు మరప రాజు, బీజేపీ మండలాధ్యక్షుడు ఆరెల్లి రాజలింగం, కనక తుకరాం, దిలీప్ మోరే, ముండే సాయినందన్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న కమిషనర్‌కు సన్మానం

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు బదిలీపై వెళ్తున్న సందర్భంగా సోమవారం మున్సిపల్ కార్యాలయ చైర్మెన్ ఛాంబర్‌లో మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, కౌన్సిలర్లు, కార్యాలయ సిబ్బంది పలువురు శాలువాతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ మాట్లాడారు. కమిషనర్‌గా విధి నిర్వహణలో ఉత్తమ సేవాలందించారని కొనియాడారు.

అంబేద్కర్ ఆశయాలు కొనసాగించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరు కొనసాగించాలని మాజీ జడ్పీటీసీ నాగేశ్వరరావు అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే 68వ దమ్మచక్ర పరివర్తన దివస్ పోస్టర్‌ను నిర్వాహకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలు ఎంతో గొప్పవని వాటిని కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ దీపక్, అంబేద్కర్ కమిటీ అశోక్, సుధాకర్, జడి రోహిదాస్, బాబురావు, జనార్దన్, గౌతమ్ పాల్గొన్నారు.

గిరిజన పోడు రైతులకు పంట రుణాలు ఇవ్వాలి



నవతెలంగాణ-తాంసి

గిరిజన పోడు రైతులకు పంట రుణాలు ఇవ్వాలని కోరుతూ సోమవారం భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామపంచాయతీ పరిధిలోని మందపల్లి, శాంతినగర్ గ్రామాలకు చెందిన 57 మంది గిరిజన పోడు భూమి రైతులు కోరుతున్నారు. భూమి లేని పేద గిరిజనులకు గత ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి మూడు, నాలుగు ఎకరాల చొప్పున మొత్తం 110 ఎకరాల భూములు ఇచ్చారని అన్నారు. నిజానికి తాత ముత్తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న భూములకు మాజీ సీఎం కేసీఆర్ పట్టాలు ఇవ్వాలన్నారు. రైతుబంధు కూడా వచ్చేదని, పంట రుణాలు ఇచ్చే విధంగా చూస్తానని ఆదేశాలు ఇచ్చారు. తర్వాత సర్కారు మారిందన్నారు. ఏ బ్యాంకుకు వెళ్లిన పంట రుణాలు ఇవ్వక పోవడంతో రైతులు అయోమయంలో ఉన్నారు. గత మూడు నెలల కింద జిల్లా కలెక్టర్ రాజర్షిషా అర్లి(టి) గ్రామం సందర్శించి నప్పుడు ఆర్వోఎఫ్ఆర్ రైతులు తమకు పంట రుణాలు ఇప్పించాలని కోరారు. దీంతో జిల్లా కలెక్టర్ బ్యాంక్ అధికారులకు సూచనలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా లేదని, కనీసం పంట రుణం లేదని, పోడు సాగు కష్టమవుతుందని రైతులు వాపోయారు. తమ సమస్యలు పరిష్కరించాలని పోడు రైతులు కోరారు.

ప్రమాదవశాత్తు నీటమునిగి రజకుడు మృతి



నవతెలంగాణ-సారంగాపూర్

ప్రమాదవశాత్తు నీటమునిగి రజకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని జౌలి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబీకులు, ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం... జౌలి గ్రామానికి చెందిన రజకుడు మర్రిపెద్ద లింగయ్య(31) కులవృత్తిలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం గ్రామ సమీపంలోని స్వర్ణ ప్రాజెక్టు వద్ద బట్టలు ఉతుకేందుకు వెళ్లాడు. రాత్రి అయిన ఇంటికి రాకపోవడంతో సోమవారం ఉదయం వెతుకుతుండగా ప్రాజెక్టు గేట్ల వద్ద మృతదేహం లభ్యమైంది. బట్టలు ఉతికే క్రమంలో ఫిట్స్ రావడంతో ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందినట్టు ప్రాథమిక విచారణలో తెలిందన్నారు. మృతుని భార్య సురేఖ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

టీడీపీ అడ్‌హక్ కమిటీ కన్వీనర్ నియామకం

నవతెలంగాణ-కాగజ్‌నగర్



తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు(2024-26)కు అదిలాబాద్ పార్లమెంట్ స్థానానికి అడ్‌హక్ కమిటీ కన్వీనర్‌గా ఆ పార్టీ పార్లమెంట్ అధ్యక్షులు గుళ్లపెల్లి ఆనంద్‌ను నియమించారు. ఈ మేరకు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింహులు లేఖ విడుదల చేశారు. రాష్ట్రంలోని 16 పార్లమెంట్ స్థానాలకు అడ్‌హక్ కమిటీ కన్వీనర్ల నియామకం చేపట్టగా ఆదిలాబాద్‌కు ఆనంద్‌ను నియమిస్తున్నట్లు ఆ లేఖలో పేర్కొన్నారు.

జీఓనెం.29ని రద్దు చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జీఓనెం.29ని రద్దు చేయాలని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేష్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన బీసీ కమిషన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల వారిగా కల్పించాల్సిన రిజర్వేషన్‌ల దామాషాను ఖరారు చేసే అంశంపై నిర్వహించిన బహిరంగ విచారణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈడబ్ల్యూఎస్‌ను, జీఓ నెంబర్ 29ను పున: పరిశీలించి, రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 340 ప్రకారం రిజర్వేషన్‌లను యాదవిధంగా కొనసాగించాలని అన్నారు. అనంతరం బీసీ కమిషన్ చైర్మెన్ నిరంజన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు మేకల మల్లన్న, సంయుక్త కార్యదర్శి ముల్కల రాజేశ్వర్, అసోసియేట్ అధ్యక్షులు పాశం రాఘవేంద్ర, ఉపాధ్యక్షులు మలపతి సుభాష్ పాల్గొన్నారు.

'రేషన్ కార్డుల మంజూరులో జాప్యం సరికాదు'

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

ప్రజలకు అందించే రేషన్ కార్డులు మంజూరు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందని బీఎస్పీ నిర్మల్ జిల్లా ఇన్‌చార్జీ జగన్‌మోహన్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ రేషన్ కార్డుల మంజూరులో కాలయాపన చేస్తూ, ఉప సంఘం, కమిటీలు అంటూ ప్రజలను మభ్య పెడుతున్నారని అన్నారు. ప్రభుత్వానికి ప్రజల సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే రేషన్ కార్డుల నోటిఫికేషన్ జారీ చేయాలని అన్నారు. ఎంతో మంది కొత్తగా పెండ్లి అయిన వారు, వలస వెళ్లిన వాళ్లు, కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. అద్దె ఇంట్లో ఉన్నవారికి గృహజ్యోతి వర్తించడం లేదని, గ్యాస్ సబ్సిడీ, ఇటీవల రైతు రుణమాఫీ అన్నింటికీ, కుటుంబం యూనిట్ రేషన్ కార్డు ఆధారం అంటూ కొర్రీలు పెట్టి, అనేకమందిని సంక్షేమ పథకాలకు దూరంగా ఉండేలా చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా తొమ్మిది సంవత్సరాలు రేషన్ కార్డులు మంజూరుకై జాప్యం చేసి, ప్రజల వ్యతిరేకతతో కేసీఆర్ ప్రభుత్వం కూలిపోయిందన్నారు. కాంగ్రెస్ సర్కారు అదే దారిన వెళ్తూ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ప్రజాపాలన అని గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల అభీష్టం మేరకు రాష్ట్ర పరిపాలన సాగించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైన రేషన్ కార్డుల మంజూరు జాప్యం లేకుండా మంజూరు చేయాలని అన్నారు. ఏలాంటి ఆక్షేపణలు లేకుండా, ప్రభుత్వం పథకాలు ప్రజలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-బేల

మండలంలోని పలు గ్రామాల్లో కుటుంబ సభ్యులను కోల్పోయి బాధపడుతున్న వారి కుటుంబాలను సోమవారం మాజీ మంత్రి జోగు రామన్న ఆయా గ్రామాలకు వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. దహెగావ్ గ్రామవాసీ గంగారాం, కొగ్దూర్ గ్రామం బావ్‌రావ్, కొబ్బయి మడావి కిషన్, మంగ్రూడ్ సుధాకర్ చౌహన్ కుటుంబాలను పరామర్శించారు.

విద్యార్థి చదువుకు రూ.61వేల ఆర్థిక సాయం



నవతెలంగాణ-నార్నూర్

జైనూర్ మండలంలోని జండాగూడ గ్రామానికి చెందిన ఆదివాసీ నిరుపేద కుటుంబానికి చెందిన మెస్రం న్యానేశ్వర్ కుమార్తె మెస్రం శ్రద్ధా ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. ఈ సందర్భంగా సోమవారం ఉట్నూర్‌లో అభిమాన్యు గ్రూప్ ఆధ్వర్యంలో జిల్లా సార్మెడి దుర్గు పటేల్, విద్యావేత్త మెస్రం మనోహర్ చేతుల మీదుగా విద్యార్థికి సన్మానించారు. అనంతరం కాలేజ్ ఫీజు కొరకు రూ.61 వేల నగదును అందించారు. ఆదివాసీ పర్ధాన్ సమాజం నుంచి ఒక నిరుపేద కుటుంబం నుంచి కష్టపడి చదివి ఎంబీబీఎస్‌లో సీటు సాధించి, యావత్ ఆదివాసీ సమాజానికి ఆదర్శంగా నిలిచారని అన్నారు. ఇలాగే మరింత ఉన్నతంగా చదివి ఆదివాసీ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటానికి డాక్టర్‌గా నిరుపేదలకు సేవ చేయాలని కోరారు. ఆర్థిక సాయం అందించిన వారిలో అభిమాన్యు గ్రూప్ నిర్వాహకులు మెస్రం శేఖర్‌బాబు, పెందూర్ దీపక్, గాదిగూడ మండలం పీఆర్టీయూ అధ్యక్షులు మెస్రం లింగు, కార్యదర్శి మెస్రం నెహ్రూ, ఆదివాసీ తుడుం దెబ్బ నాయకులు ఉన్నారు.

బీసీ కమిషన్ చైర్మెన్‌ను కలిసిన జెడ్పీటీసీ



నవతెలంగాణ-తలమడుగు

రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మెన్ నిరంజన్‌ను మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి సోమవారం జిల్లా కేంద్రంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువా కప్పి సన్మానించారు. అదే విధంగా భైంసా మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా నూతనంగా నియమించబడిన ఆనంద్‌రావు పటేల్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బాబన్న, మాజీ ఎంపీపీ కళ్యాణం లక్ష్మీ రాజేశ్వర్, మాజీ ఎంపీటీసీ వెంకన్న, రావుల నారాయణ పాల్గొన్నారు.